
0933520440
09305978486
09794359502
PRAYAG TEERTH PUROHIT
KRISHNA SHASTRI
AND HIS SON
ORGD : BY BHAIYAN SHASTRI (BABU GARU)
32, Daragani Near Police station PRAYAGARAJ.
GANGARAM PRABHAULALJI & SONS



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 267 విశాఖపట్నం, 09 ఆగస్టు 2023 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00



Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.


## స్మార్ట్ సిటీ పథకం ద్వారా విశాఖకు ఎంత ఇచ్చారు ?

### పార్లమెంట్‌లో జీవీఎల్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పార్లమెంటులో బిజెపి ఎంపీ జీవీఎల్ నరసింహారావు స్మార్ట్ సిటీ పథకం క్రింద కేంద్ర ప్రభుత్వం విశాఖ ప్రజల సౌకర్యార్థం విశాఖకు కేటాయించిన వివిధ రకాల ప్రాజెక్టులపై ప్రశ్నించారు.

విశాఖపట్నంలో స్మార్ట్ సిటీస్ మిషన్ కింద మంజూరు చేయబడిన అన్ని ప్రాజెక్టుల జాబితాను, వాటి పూర్తి వివరాలు, మరియు వాటికై కేటాయించిన మరియు వినియోగించిన నిధుల వివరాలను, ప్రస్తుత స్థితి గతులపై జీవీఎల్ ప్రశ్నించారు. వాటితోపాటు వ్యక్తిగత ప్రాజెక్ట్‌ల వారీగా ఆమోదించబడిన 61 ప్రాజెక్ట్‌ల వ వివరాలను తెలియజేయమని మంత్రిత్వ శాఖను కోరగా, కేంద్ర గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రి విశాఖకు స్మార్ట్ సిటీ పథకం కింద కేటాయించబడిన పూర్తి ప్రాజెక్ట్ వివరాలు తెలియజేయడం జరిగింది.

వాటితోపాటు జీవీఎల్ బీచ్ రోడ్‌లోని విశాఖపట్నం పార్క్ అభివృద్ధి లేదా పునరుద్ధరణ కోసం కేంద్రం అందజేసిన నిధుల వినియోగం గురించి, కాలనీలో ఇండోర్ స్పోర్ట్స్ అరేనా నిర్మాణం, మరియు జగదాంబ జంక్షన్‌లో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కోసం కేంద్రం మంజూరు చేసిన నిధులు వివరాలు వాటి వినియోగం గురించి, ముఖ్యంగా స్మార్ట్ సిటీస్ మిషన్ కింద నిధుల దుర్వినియోగంపై అందిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల వివరాలపై జివిఎల్ మంత్రిని ప్రశ్నించారు.

వీటిపై గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శ్రీ కౌశల్ కిషోర్ జీవీఎల్ కు సమాధానం ఇస్తూ భారత ప్రభుత్వం 25 జూన్ 2015న స్మార్ట్ సిటీస్ మిషన్‌ని ప్రారంభించిందనీ, కేంద్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 4 నగరాలు అమరావతి,

(మిగతా 2లో)



## వీగిపోయిన అవిశ్వాసం

లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై వాడివేడిగా చర్చ జరుగుతోంది. అంతకుముందు పార్లమెంట్ లైబ్రరీ భవనంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరై ఎంపీలకు పలు సలహాలు సూచనలు చేశారు. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై, మాట్లాడాల్సిన అంశాలను ప్రస్తావించారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ సర్వీసెస్ బిల్లుపై రాజ్యసభలో ఓటింగ్ 2024 సార్వత్రిక ఎన్నికలకు సెమీ ఫైనల్స్ అని కొందరు అహంకారంతో అన్నారని, సెమీఫైనల్‌లో విజయం సాధించినందుకు ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే వారు అవినీతి, కుటుంబవాదం, బుజ్జగింపు రాజకీయాలతో సామాజిక న్యాయానికి అతిపెద్ద నష్టం చేస్తున్నారంటూ ప్రధాని మోడీ ఇండియా కూటమిపై మండిపడ్డారు. ఆగస్ట్ 9 నుంచి బీజేపీ మరో క్విట్ ఇండియా నినాదం ఊపందుకుంటుందంటూ పేర్కొన్నారు. విపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం ఇండియా బ్లాక్ పార్టీల మధ్య పరస్పర అవిశ్వాసానికి ప్రతిబింబమంటూ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎందుకంటే వారు తమ ప్రతిపాదనతో ఎవరు ఉన్నారు.. ఎవరు లేరు అని పరీక్షించాలనుకుంటున్నాయంటూ పేర్కొన్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ప్రతిపక్ష కూటమిని 'ఘమాండియా' (అహంకారం) తో ఉందని అభివర్ణించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజ్యసభలో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుపై జరిగిన ఓటింగ్‌ను సెమీఫైనల్‌గా కొందరు ప్రతిపక్ష సభ్యులు అభివర్ణించారని, జాతీయ ఎన్నికల్లో బిజెపికి

(మిగతా 2లో)

## కర్ణాటక ఎన్నికల కేసులో నడ్డా గెలుపు



**బెంగళూరు/న్యూఢిల్లీ:** బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై దాఖలైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఇటీవల జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విజయనగరం జిల్లా హరప్పనహళ్లిలో నిర్వహించిన బహిరంగ ప్రచారంలో ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ప్రసంగం చేశారన్న ఆరోపణల నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ. నడ్డా విముక్తి పొందారు.

తనపై హరప్పనహళ్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును రద్దు చేయాలని, ధారవాడ హైకోర్టు బెంచ్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణను రద్దు చేయాలని కోరుతూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం అంగీకరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జేపీ నడ్డా పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు ఆయనపై నమోదు అయిన కేసును రద్దు చేయాలని ఆదేశించింది.

జేపీ నడ్డా తరఫు సీనియర్ న్యాయవాది వాదిస్తూ నడ్డా తన ప్రసంగం ద్వారా ఓటర్లను ప్రలోభ పెట్టి, బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే ఫిర్యాదుదారుడి వద్ద దానిని నిరూపించడానికి ఎటువంటి

(మిగతా 2లో)

## జిల్లా పోలీస్ కార్యాలయంలో " మొబైల్ రికవరీ మేళా "






**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పోలీసులు అతి తక్కువ సమయంలోనే 4 వ విడతలో భాగంగా ఉమ్మడి జిల్లాలు అయిన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, కడప నుండి రికవరీ చేసిన 43 లక్షల విలువైన 235 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మొబైల్స్ ట్రేస్ చేసిన ఐటి కోర్ సిబ్బందిని ఈ సి ఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో "మొబైల్ రికవరీ మేళా" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడారు. 235 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు ఐటీ కోర్ టీమ్ పోలీసులు మొబైల్ ట్రాకింగ్ పై బాగా పని చేస్తున్నారన్నారు. పోయిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నామన్నారు. ఎంతవరకు నాలుగు విడతల్లో 692 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. వీటి వల్ల కోటీ 11 లక్షలు ఉంటుందన్నారు.మొబైల్ మిస్సింగ్ గురించి ప్రజలు పోలీసు స్టేషన్ లకు వెళ్ళడం పై అసౌకర్యంగా ఉందని ఫీడ్ బ్యాక్ రావడంతో సులభతరమైన పద్ధతిలో మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్ సైట్ ను ఏర్పాటు చేశామన్నారు.

మొబైల్ మిస్సింగ్ కేసులలో త్వరితగతిన రికవరీ అవుతున్నందువలన ప్రజలు మొబైల్ మిస్సింగ్ పై ఫిర్యాదులు చేయుటకు ముందుకు వస్తున్నారు. సెల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరి అయిన వాటి పరిష్కారం పై అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.సెల్ ఫోన్లు రికవరీ చేసి ఇవ్వడం ఆనందంగా ఉందని, జిల్లా ఎస్పీ కి, అనకాపల్లి జిల్లా పోలీసులకు సెల్ ఫోన్లు పొందిన లబ్ధిదారులు, బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ మొబైల్ రికవరీ మేళా కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి. విజయభాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, ఐటి కోర్ ఎస్సై రఘు వర్మ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ నేతలకు 'చిరు' సలహా



చిరంజీవి పొలిటికల్ కామెంట్స్ ఏపీలో కాకరేపుతున్నాయ్!. సినిమాల సంగతి తర్వాత.. ముందు వాటి సంగతి చూడండి అంటూ మెగాస్టార్ సంధించిన అస్త్రాలు ఆంధ్రాలో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయ్. చిరంజీవి కామెంట్స్‌పై ముప్పేట దాడి చేస్తున్నారు వైసీపీ లీడర్స్. ఇంతకీ, మెగాస్టార్ ఏమన్నారు?. వైసీపీ నుంచి పడుతోన్న కౌంటర్స్ ఏంటి? వివరాల్లోకి వెళితే.. పదేళ్లక్రితం రాజకీయాలను వదిలేసిన మెగాస్టార్ చిరంజీవి ఫస్ట్‌టైమ్ పొలిటీషియన్స్‌పై హాట్ కామెంట్స్ చేశారు. అదీ కూడా ఏపీ రాజకీయ నేతలపై!. మా పనేదో మేం చేసుకుంటున్నామ్!. మీకెందుకయ్యా మా గురించి అంటూ డైరెక్ట్ ఎటాక్ చేశారు. సూటిగా సుత్తి లేకుండా ఎవరికి తగలాలో వాళ్లకే తగిలేలా సంచలన వ్యాఖ్యలు చేశారు చిరంజీవి. ముందు, ప్రత్యేక హోదా, ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పేదల గురించి ఆలోచించండి. ఇవిచేస్తే మీకు తలొంచి నమస్కరిస్తా!. ఇవన్నీ వదిలేసి.. పిచ్చుకలాంటి సినీ పరిశ్రమపై పడతారెందుకయ్యా అంటూ ప్రశ్నించారు. ఇదేదో దేశ సమస్య అన్నట్టు ప్రాజెక్ట్ చేస్తున్నారని మండిపడ్డారు మెగాస్టార్ చిరంజీవి వాల్తేరు వీరయ్య 200డేస్ ఫంక్షన్‌లో చిరంజీవి చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు ఏపీలో రాజకీయ కాకరేపుతున్నాయ్. అయితే, చిరంజీవి చేసిన ఈ కామెంట్స్‌నే సరిగ్గా మూడ్రోజుల్రక్రితం పవన్ కల్యాణ్ చేశారు. సినిమా సంగతి తర్వాత ముందు వాటి పని చూడండయ్యా అంటూ ప్రభుత్వంపై అస్త్రాలు ఎక్కుపెట్టారు.

**కొడాలి, పేర్ని కౌంటర్..**

ఇంకేముంది ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. వైసీపీ నేతలు ఒక్కొరుగా చిరంజీవికి పరోక్షంగా స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో అటు చిరంజీవి, ఇటు పవన్ కల్యాణ్.. ఇద్దరికీ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేశారు వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని. పకోడిగాళ్లు అంటూ ఘాటైన కామెంట్స్ చేశారు. ఆ సలహాలేవో నీ సినిమావాళ్లకు ఇచ్చుకో అంటూ ఒక రేంజ్‌లో నిప్పులు చెరిగారు కొడాలి.. పకోడిగాళ్లు మాకు సలహాలిస్తున్నారు.. ఆ సలహాలేవో సినీ ఇండస్ట్రీలో వాళ్లకు ఇవ్వాలి.. పవన్.. 4చోట్ల పోటీచేసినా ఓడిపోతారు.. అంటూ కొడాలి నాని ఫైర్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా వచ్చేలా కృషి చేయాలన్న సినీ నటుడు చిరంజీవి సూచనపై పేర్ని నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అభిమాన నటుడు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రానికి అన్యాయం జరిగిందని అన్నారు. ప్రత్యేక హోదా చట్టంలో పెట్టకుండా అప్పటి ప్రభుత్వం వ్యవహరించినప్పుడు అప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న చిరంజీవి ఏం చేశారని నాని ప్రశ్నించారు.

**అంబటి, బొత్స ఫైర్..**

ఏమ్ మీరు గిల్లితే మేం గిల్లిచ్చుకోవాలా? అంటున్నారు మంత్రి అంబటి రాంబాబు.

(మిగతా 2లో)

## రాష్ట్రంలో మొదలైన రాజకీయ అలజడి

### వేగంగా కదులుతున్న జంప్ జిలానీలు



**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఎన్నికలకు ఎనిమిది నెలల ముందే ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయిపోయింది. రాష్ట్రంలో రాజకీయాలు చూస్తే అప్పుడే ఎన్నికలు వచ్చేసాయా అనే వాతావరణం కనిపిస్తుంది. షెడ్యూల్ ప్రకారం లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు ఏప్రిల్ 2024లో జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలు ఉండే అవకాశం ఉందని అధికార పార్టీ మినహా మిగిలిన పార్టీలు అంచనాలు వేస్తున్నాయి. అయితే తాము ముందుగా ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం లేదని అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పదేపదే చెప్పుకొస్తుంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల వరకూ అందేలా ముందుకెళ్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఇక వృద్ధాప్య పెన్షన్‌లు కూడా ఇచ్చిన హామీ ప్రకారం వచ్చే జనవరి నుంచి మూడు వేలకు పెంచాల్సి ఉందని చెబుతున్నారు. ఇలా అన్ని హామీలు మాట తప్పకుండా పూర్తిచేయాల్సి ఉంది కాబట్టి ముందస్తు ఊసే లేదని అంటున్నారు.ఇటీవల కూడా ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగితే స్వయంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి తీవ్రంగా ఖండించారు.కానీ ముందస్తు లేకపోయినా 2024 కోసం ప్రధాన పార్టీలన్నీ ఇప్పటి నుంచే ప్రజల్లో ఉంటుండటంతో ఎన్నికల కోలాహలాన్ని తలపిస్తుంది.

**వ్యూహాలకు పదును పెడుతున్న ముఖ్య పార్టీల నేతలు..**

ఎన్నికల వేడిలో ఇప్పటి నుంచే అన్ని ప్రధాన పార్టీల అధ్యక్షులు

(మిగతా 2లో)

## టమాటా @ 63



మొన్నమొన్నటి వరకూ సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్న టమాట ధరలు తగ్గుతున్నాయి. గడచిన రెండు రెండు రోజులుగా ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. మొన్నటి వరకూ కిలో టమాట రూ.300 వరకు చేరే అవకాశం ఉందని బెంబేలెత్తిపోతున్న తరుణంలో అనూహ్యంగా ధరలు దిగివచ్చాయి. ప్రస్తుతం రైతుబజారులో కిలో టమాటా రూ.63 వరకు విక్రయిస్తున్నారు. ఇక బయట మార్కెట్‌లలో రూ.120 నుంచి రూ.140 వరకు విక్రయిస్తున్నారు. గత పది రోజుల కిందట హైదరాబాద్ నగరానికి కేవలం 850 క్వింటాళ్ల టమాట హోల్‌సేల్ మార్కెట్‌కు చేరితే.. సోమవారం 2,450 క్వింటాళ్లు వచ్చింది. ఏపీలోని

(మిగతా 2లో)

## ఆర్ఎంపీ వైద్యులకు ఆయుర్వేద అవగాహన

**ఉత్తరాంధ్ర జిల్లాలలోని ఆర్ఎంపీ, పీఎంపీ, ఎల్ఎల్ఎం వంటి ప్రైవేట్ గ్రామీణ వైద్యులకు ఆయుర్వేద వైద్యంలోని కొన్ని ప్రధాన అంశాలపై అవగాహన కల్పించేందుకు, చర్చించేందుకు ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు విశాఖ నగరంలోని విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం మొదటి అంతస్థులో గల సమావేశ మందిరంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు గంగోత్రి హెర్బల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శర్మ ఎస్. ఆకెళ్ల, ఆ సంస్థ విశాఖ నగర ప్రతినిధి కొప్పల రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.**

**మధుమేహ రోగులు, నిరంతరం జలుబుతోనూ, ఊపిరితిత్తుల సమస్యలతోనూ బాధపడేవారికి ఖచ్చితమైన వైద్యం ఎలా చేయాలో, ఎటువంటి మందులు వినియోగించాలో తెలియజేసేందుకు, ఆర్ఎంపీ వైద్యుల సందేహాలకు విస్తృతమైన సమాధానాలు ఇచ్చేందుకు ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సుధీర్ జోషి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని రామ్‌కుమార్ తెలియజేశారు. నగరంలోని, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేద వైద్యం పట్ల ఆసక్తి కలిగిన వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు 9393949345 నెంబరుకు వాట్సాప్ ద్వారా తమ వివరాలు ముందుగా పంపితే అవకాశం కల్పిస్తామని వారు తెలిపారు.**

## ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోండి



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి. కాంతారావు సూచించారు. మంగళవారం జిల్లా పర్యటనలో భాగంగా పాడేరు మండలంలో పలు ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సభ్యులు మాట్లాడుతూ, ఎటువంటి అవకతవకలకూ చోటు లేకుండా విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను తప్పు త్రోవ పట్టించినా, పథకాల అమలు సక్రమంగా లేకపోయినా అందుకు భాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన, సంపూర్ణ పోషణ, నాడు-నేడు, అమ్మ ఒడి తదితర పథకాలు అమలును పర్యవేక్షించటానికి విచ్చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పిల్లల జ్ఞాపక శక్తి పెంపొందించటానికి ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తు చేసారు.

ముందుగా డిపో 151 సందర్శించి స్టాక్ బోర్డులో వివరాలు ప్రకటించాలని డిపో డీలర్ ను ఆదేశించారు. ఎండియు వాహనం 13 వద్ద ఆపరేటర్ స్టాక్ వివరాలలో అవకతవకలు ఉన్నట్లు గుర్తించిన సభ్యులు ఆపరేటర్ కు మెమో జారీ చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. గుడివాడ2 లో గల అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన సభ్యులు స్టాక్ వివరాలు వెల్లడించడంలో లోపాలను గుర్తించి సంబంధిత టీచర్ కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సుండ్రుపుట్టు అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టిలో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండడంతో సదరు టీచర్ కు కూడా మెమో జారీ చేయాలని ఆదేశించారు. పాడేరు ప్రభుత్వ హై స్కూల్ లో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్నం భోజన ఆహారాన్ని పరిశీలించి పిల్లలకు స్వయంగా వడ్డించి వారితోపాటు సహ భోజనం చేసిన సభ్యులు విద్యార్థుల విద్యాభ్యాసానికి, వారి భవిష్యత్తుకు సంబంధించి పలు సూచనలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సరఫరా అధికారి పి.వి. శ్యాం కుమార్, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కొండల రావు, ఎటిడబ్ల్యుఒ రజని, ఐసిడిఎస్ పిడి ఎన్. సూర్యలక్ష్మి, సిడిపిఒ ఝాన్సి, రెవిన్యూ, విద్య, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 7వ బ్రిక్స్ పరిశ్రమల మంత్రుల సమావేశంలో పాల్గొన్న పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్



**విజయవాడ, (పీఐబీ):** దక్షిణాఫ్రికా అధ్యక్షతన వర్చువల్ విధానంలో నిన్న వర్చువల్ విధానంలో జరిగిన "7వ బ్రిక్స్ పరిశ్రమల మంత్రుల" సమావేశంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల, జౌళి, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖల మంత్రి పీయూష్ గోయల్ పాల్గొన్నారు. 2023లో బ్రిక్స్ స్టార్టప్ ఫోరమ్ ను భారత్ ప్రారంభిస్తుందని గోయల్ ప్రకటించారు స్టార్టప్ లు, పెట్టుబడిదారులు, ఇంక్యుబేటర్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల మధ్య సహకారాన్ని సులభతరం చేయడం, ఉత్తమ విధానాలు పంచుకునే లక్ష్యంతో బ్రిక్స్ స్టార్టప్ ఫోరమ్ ను ప్రారంభించాలని నిర్ణయించామని గోయల్ తెలిపారు.

భారతదేశంలో జరుగుతున్న అభివృద్ధిని గోయల్ వివరించారు. దేశంలో స్టార్టప్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపిన శ్రీ గోయల్ ప్రస్తుతం దాదాపు 100,000 స్టార్టప్ లు ఏర్పాటయ్యాయని వివరించారు. దేశంలో అమలు జరుగుతున్న స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ఆయన వివరించారు. ఉత్పత్తి విధానంలో భారతదేశం తీసుకు వచ్చిన మార్పులు వివరించిన మంత్రి తన అనుభవాలను బ్రిక్స్ దేశాలు, ప్రపంచ దేశాలతో పంచుకోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని తెలిపారు.

"వసుధైక కుటుంబకం" ('ప్రపంచం ఒకే కుటుంబం') స్ఫూర్తితో భారతదేశం పనిచేస్తుందని శ్రీ గోయల్ స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన దేశంగా పనిచేస్తూ మరింత సమ్మిళిత, సహనశీల, పరస్పర అనుసంధానిత ప్రపంచం కోసం పనిచేయడానికి భారతదేశం సిద్ధంగా ఉందన్నారు.

బ్రిక్స్ దేశాల పరిశ్రమల మంత్రులు (బ్రెజిల్, రష్యా, చైనా, సౌతాఫ్రికా) కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశం సంయుక్త ప్రకటనను ఆమోదించింది.

బ్రిక్స్ దేశాల మధ్య డిజిటలైజేషన్, పారిశ్రామికీకరణ, ఆవిష్కరణలు, సమగ్ర విధానం అవసరమని మంత్రులు స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆవశ్యకతను మంత్రులు పునరుద్ఘాటించారు.ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ ప్రాధాన్యత, పరిశ్రమ 4.0 అవసరాన్ని మంత్రులు వివరించారు.అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశాలను ఆర్థిక రంగంలో ప్రవేశ పెట్టాలన్నారు. మానవ వనరుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని బ్రిక్స్ దేశాల మంత్రులు తమ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు .నైపుణ్యాభివృద్ధి, అభివృద్ధి రంగాలలో కలిసి పనిచేయడానికి ఉన్న అవకాశాలు గుర్తించాలని మంత్రులు అంగీకరించారు. .బహిరంగ, నిష్పాక్షిక, శక్తివంతమైన, స్థితిస్థాపక మరియు వివక్ష రహిత వాతావరణాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక సహకారాన్ని పెంపొందించాలని సమావేశం నిర్ణయించింది. పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ, వృద్ధిని వేగవంతం చేయడానికి కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని మంత్రులు అంగీకరించారు.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) కీలక పాత్రను, ప్రపంచ పారిశ్రామిక , సరఫరా వ్యవస్థ, విలువ ఆధారిత వాటి ఏకీకరణ, వైవిధ్యత ప్రాముఖ్యతను మంత్రులు గుర్తించారు.

మహిళలు, యువత యాజమాన్యంలో/నిర్వహించే ప్రాజెక్టుల సమ్మిళిత వృద్ధి కోసం బ్రిక్స్ దేశాల్లో మార్కెట్ అవకాశాలను కల్పించాల్సి ఉంటుందని మంత్రులు పేర్కొన్నారు.

## ఏపీలో నేటి నుంచి విద్యుత్ కార్మికుల సమ్మె

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ ఉద్యోగులు బుధవారం నుంచి సమ్మెకు దిగుతున్నారు, ఏపీ ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు, రేపు అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ఉద్యోగులు తాజాగా ప్రకటించారు. కాగా ముందు జాగ్రత్తగా విద్యుత్ సౌధ వద్ద 2000 మంది పోలీస్ బలగాలతో భారీ బద్రత ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ఉద్యోగుల ఆందోళన నేపథ్యంలో విజయవాడ నందు 144 సెక్షన్ 30 అమలు చేస్తున్నారు..

పంచాంగం

బుధవారం 09-08-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
అధిక శ్రావణ మాసం

**తిథి : బ. అష్టమి ఉ. 08.20**
**నక్షత్రం : భరణి ఉ. 06.57**
**వర్జ్యం : సా. 06.58 ల 08.34**

## త్రాగునీటి సరఫరాకు అంతరాయం ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** మున్సిపాలిటీలో త్రాగునీటి సరఫరాకు సంబంధించిన సోముదేవుపల్లిలో ప్రధాన నీటి సరఫరా పంపు మరమత్తులకు గురైనందున నీటి పంపింగు జరగకపోవడం వలన బుధవారం నాడు పాతవీధి, తులసినగర్, ఓరుగంటివారి వీధి,రంగవారి వీధి, ఉలక్ పేట, ఎస్. సి. కాలనీ, కాకివాని వీధి, భావనరుషి గుడి వీధి, ధర్మవరం, కోర్టుపేట,గాంధీనగర్, కొత్తపేట,మిలట్రీ కాలనీ,యానాద్రి కాలని, నెహ్రూనగర్, ద్వారకా నగర్, ఫైర్ ఆఫీసు కాలని, ఏ.యస్.ఆర్ కాలని, రాంనగర్, ఎన్.టి.ఆర్ కాలని వార్డులకు నీటి సరఫరా జరగదని మున్సిపల్ ఇంజనీర్ అధికారి తెలిపారు.పైన తెలిపిన వార్డులలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయనున్నారు.

## జాబ్ మేళా కి 61 మంది హాజరు 17 మంది ఎంపిక



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పాడేరులోఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహించబడింది. ఈ జాబ్ డ్రైవ్ నందు సుమారు 2 కంపెనీ పాల్గొని ఇంటర్వ్యూస్ నిర్వహించారు.ఈ డ్రైవ్ నందు 61 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారని 17 మంది సెలెక్ట్ అయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జీ.ప్రశాంత్ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది మరియు స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ జి. ప్రశాంత్ గారు పాల్గొన్నారు.

# (మొదటి పేజీ తరువాయిలు)

## స్మార్ట్ సిటీ పథకం ద్వారా విశాఖకు ఎంత ఇచ్చారు ?

కాకినాడ, తిరుపతి & విశాఖపట్నంలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిందని తెలియజేస్తూ విశాఖపట్నం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల వివరాలు పూర్తిగా అందచేశారు.

**కేంద్రంచే వీఎంఆర్డీఏ పార్కు అభివృద్ధి**

విశాఖపట్నం పార్క్ మూడు జోన్లలో 33 ఎకరాల్లో విస్తరించి ఉన్నదనీ, ఈ పార్కును అన్ని వయసుల వారికి ఉపయుక్తంగా స్మార్ట్ పార్క్‌గా అభివృద్ధి చేస్తున్నారనీ దీనిలో ప్రకృతి కాలిబాట, సైకిల్ ట్రాక్, మూలికా మొక్కలతో ల్యాండ్‌స్కేపింగ్, యోగా సర్కిల్‌తో కూడిన ప్రత్యేకతతో ఫుడ్ కోర్టులు, బ్యాడ్మింటన్, టెన్నిస్ & బాస్కెట్‌బాల్ కోర్టులు, పిల్లల ప్లేజోన్, అవుట్‌డోర్ జిమ్ ఏరియా, బోటింగ్ సదుపాయం పునరుద్ధరణ మెరుగైన పార్కింగ్ సౌకర్యాలపై కేంద్రం ఇప్పటివరకు 31 జూలై 2023 నాటికి 30.76 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి తెలియజేశారు.

**ఎంవీపీ కాలనీలో ఇండోర్ స్పోర్ట్స్ ఎరెనా**

విశాఖపట్నం స్మార్ట్ సిటీ కాలనీలో 4776 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కూడా కేంద్రం అభివృద్ధి చేసిందని, 2540 Sq.m విస్తీర్ణంలో 294 మంది కూర్చునే సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఈ స్టేడియం బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, హాఫ్ ఒలింపిక్ సైజ్ స్విమ్మింగ్ పూల్, కిడ్స్ పూల్, అవుట్‌డోర్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, డార్మిటరీలు, బోర్డ్ గేమ్ రూమ్, జాగింగ్ ట్రాక్ వంటి ఇండోర్ సౌకర్యాలను కలిగి ఉన్నదని దీనిపై కేంద్రం జూలై 31, 2023 నాటికి 21.89 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి తెలియజేశారు.

**జగదాంబ జంక్షన్ వద్ద మల్టీ-లెవల్ సెమీ ఆటోమేటిక్ కార్ పార్కింగ్**

వీధి పార్కింగ్‌ను తగ్గించడం ద్వారా జగదాంబ మార్కెట్ ప్రాంతంలో రద్దీని తగ్గించడం లక్ష్యంగా కేంద్రం జగదాంబ జంక్షన్ వద్ద 100 కార్ల సామర్థ్యం కలిగిన మల్టీ-లెవల్ సెమీ ఆటోమేటిక్ కార్ పార్కింగ్ ను 368 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి చేయగా దానిపై కేంద్రం దీని కొరకు 31 జూలై 2023 నాటికి, 10.14 కోట్లు ఖర్చు చేసిందని సమాధానం ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం మరియు పట్టణ స్థానిక సంస్థల ఉమ్మడి యాజమాన్యంలోని స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్‌పివిలు) ద్వారా SCM అమలు జరుగుతుంది కాబట్టి, ఫిర్యాదులు/అభ్యంతరాల పై తగిన చర్య కోసం సంబంధిత SPVకి ఫిర్యాదులో అందినప్పుడల్లా, డీప్డ్ ఫిక్షన్ కేసులు, హౌసింగ్ & పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మూడవ పక్ష మూల్యాంకనాన్ని కూడా నిర్వహిస్తుంది అని మంత్రి సమాధానమిచ్చారు.

సిస్టమ్ ఇంటిగ్రేటర్

1. విపత్తు నిర్వహణ వ్యవస్థ. 2.స్మార్ట్ పోల్స్ 3 స్మార్ట్ సెన్సార్‌లు (ఎన్విరాన్‌మెంటల్ సెన్సార్‌లు/వెహికల్ ట్రాకింగ్ GPS యూనిట్). 4.స్మార్ట్ బిన్‌లు,5 స్మార్ట్ GPS ఆధారిత బస్సులు మరియు బస్ స్టాప్‌లు (100 బస్సులు & 50 బస్ స్టాప్‌లు) 6 స్మార్ట్ సిగ్నలింగ్, ట్రాఫిక్ & cctvనిఘా (10 RLVD సిగ్నల్స్, 500 కెమెరాలు). 7.ట్రాఫిక్ సిగ్నల్స్(50) GIS అప్లికేషన్ ం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ం ఆన్‌లైన్ సోలార్ ప్రాజెక్టులు, ముడసర్లోవ రిజర్వాయర్‌పై 2 మెగావాట్ల సోలార్ ఫ్లోటింగ్ పవర్ ప్లాంట్. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి స్మార్ట్ పరికరాలు/అప్లికేషన్‌ల ఏకీకరణతో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు మరియు అంతరాయం లేని పని తీరు కొరకు ఇతర వ్యవస్థలతో అనుసంధానం. ఇది ఎమర్జెన్సీ సమయంలో పనిచేసే ICCC డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెంటర్‌గా పని చేస్తుంది. పునరుత్పాదక శక్తి ఉత్పత్తి కోసం నీటి వనరుల ఉపరితలాన్ని సమర్థవంతంగా ఉపయోగించే ఉద్దేశ్యంతో 3613.5 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ప్రాజెక్ట్ పూర్తి వివరాలు annexure నందు ఇవ్వబడ్డాయి. గమనించగలరు.

ఈ విధంగా ప్రజల యొక్క దైనందిన అవసరాలను మరింత సులభతరం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పై ప్రత్యేక దృష్టితో నగరాలను కేటాయించి వాటిల్లో విశాఖను ప్రముఖంగా ఎంచుకొని దానికై కేటాయింపులను చేసినందుకు ప్రధాని నరేంద్ర మోడీ గారికి, మరియు కేంద్ర ప్రభుత్వానికి జీవీఎల్ ధన్యవాదాలు తెలియజేశారు.

అంతేకాక కేంద్ర ప్రభుత్వం వందలాది కోట్ల రూపాయలను విశాఖ ప్రజల వివిధ సౌకర్యాల నిమిత్తం ఖర్చు చేస్తున్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నదనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.ఇంతకాలం కేంద్ర ప్రభుత్వం ఈ స్థాయిలో చేస్తున్న సహాయాన్ని బయట పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం వీటన్నిటిని కూడా తమ స్టిక్కర్లను అంటించుకుంటుందని, ఈ నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదని జీవీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.

**వీగిపోయిన అవిశ్వాసం**

ఉన్న అవకాశాలపై విశ్వాసం వ్యక్తం చేశారని మోడీ వివరించారు. అధికార పార్టీకి బలమైన మెజారిటీ ఉన్న లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాన్ని ఓడించడం ఖాయమైనందున, 2024 ఎన్నికలకు ముందు చివరి బంతికి పార్టీ ఎంపీలు "సిక్సర్లు" కొట్టాలటూ ప్రధాని మోడీ సూచించారు.

## కర్ణాటక ఎన్నికల కేసులో నడ్డా గెలుపు

ఆధారాలు లేవని, నడ్డా ప్రసంగం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్లు ఎటువంటి ఆధారాలు లేవని హైకోర్టులో వాదించారు.

అలాగే కేసుకు సంబంధించి మేజిస్ట్రేట్ నుండి అనుమతి పొందేటప్పుడు చట్టపరమైన నిబంధనలను పాటించలేదని, కేసును అడ్మిట్ చేయడంలో ట్రయల్ కోర్టు చర్య లోపభూయిష్టంగా ఉందని నడ్డా తరపు న్యాయవాది కర్ణాటక హైకోర్టులో వాదించారు. దీన్ని అంగీకరించిన హైకోర్టు కేసును కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మే 7వ తేదీన విజయనగరం జిల్లా హరప్పనహళ్లి పట్టణంలోని ఐ.బీ సర్కిల్ సమీపంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన జేపీ నడ్డా కర్ణాటకలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తే మీ రాష్ట్రంలో కేంద్రం పథకాలన్నీ కొనసాగుతాయని, ఎన్నికల్లో బీజేపీ ఓడిపోతే ఓటర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలు అందకుండా పోతాయని అన్నారని ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కిసాన్ సమ్మాన్ నిధి యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాలు నిలిచిపోతాయని, అభివృద్ధి కావాలంటే కర్ణాటకలో మరోసారి బీజేపీని గెలిపించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ. నడ్డా అన్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారులు హరప్పనహళ్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ జేపీ నడ్డా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. కర్ణాటక హైకోర్టు కేసును కొట్టివేయడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ, నడ్డా ఊపిరిపీల్చుకున్నారు. తన మీద తప్పుడు కేసు పెట్టారని అప్పట్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కొందరి మీద ఆరోపణలు చేశారు.

## వైసీపీ నేతలకు 'చిరు' సలహా

మమ్మల్ని గిల్లుతున్నారు కాబట్టే మేం రియాక్ట్ కావాల్సి వస్తోందంటున్నారు అంబటి. చిరంజీవి వ్యాఖ్యలకు మంత్రి బొత్స కౌంటర్ ఇచ్చారు.. సినీ పరిశ్రమ పిచ్చుక అని ఒప్పుకుంటున్నారా..? ఏపీలో పథకాలు అందరికీ అందుతున్నాయి.. ప్రతి సమస్యపై ప్రభుత్వం స్పందిస్తోందంటూ మంత్రి బొత్స ఫైర్ అయ్యారు.

## రాష్ట్రంలో మొదలైన రాజకీయ అలజడి

తమ వ్యూహాలకు పదునుపెడుతున్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి త్వరలో విశాఖకు షిఫ్ట్ కానున్నారు. ఇప్పటికే సంక్షేమ పథకాల అమలును బహిరంగ వేదికల ద్వారా ప్రజల మధ్యే నిర్వహిస్తున్న సీఎం జగన్‌ాా%ప్రతిపక్షాలకు గట్టి కౌంటర్ లు ఇస్తూ ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల క్యాంపెయిన్ మాదిరిగా ప్రభుత్వం చేసిన మంచిని, ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు బహిరంగ సభలను వేదిక చేసుకుంటున్నారు ముఖ్యమంత్రి. ఇక పార్టీ ముఖ్య నేతలతో అధినేత సమావేశాలు నిర్వహిస్తుండగా సెకండ్ కేడర్ తో సజ్జల రామకృష్ణా రెడ్డి మీటింగ్ లు పెట్టి ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. ఓవైపు సీఎం జగన్‌ాా%మరోవైపు సజ్జల ఎవరికి వారు పార్టీని, కేడర్‌ను పరుగులుపెట్టిస్తున్నారు.ఇక తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సైతం కొంతకాలంగా ప్రజల్లోనే ఉంటున్నారు. తనయుడు లోకేష్ యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్తుండగా చంద్రబాబు సైతం ఏదోఒక కార్యక్రమం ద్వారా జిల్లాల పర్యటనల్లో ఉన్నారు. గతంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి పేరిట రోడ్ షోలు, బహిరంగ సభలతో ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ప్రజల్లోకి వెళ్లారు.ఆ తర్వాత భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో సభలు నిర్వహించారు. తాజాగా సాగునీటి ప్రాజెక్ట్ ల సందర్శనతో ఎన్నికల హీట్ మరింత పెంచేశారు. చంద్రబాబు ప్రాజెక్ట్‌ల పర్యటనకు వెళ్లడం, ఆ తర్వాత పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం విఫలం అయిందంటూ ప్రజల్లోకి వెళ్తున్నారు. చంద్రబాబు వరుస పర్యటనలతో తెలుగుదేశం పార్టీ కేడర్ లో కూడా కొత్త ఊపు కనిపిస్తుంది. చంద్రబాబు విమర్శలకు వైసీపీ నేతలు కూడా కౌంటర్ లు ఇస్తుండటంతో ప్రాజెక్ట్ ల పర్యటనలు కాస్తా ఎన్నికల పర్యటనలుగా మారిపోయాయి.

మరోవైపు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సైతం వారాహి యాత్రలతో పార్టీ నేతలు, కార్యకర్తలను ఎన్నికల మూడ్ లోకి తీసుకెళ్లిపోయారు. ఇప్పటికే రెండు విడతల యాత్ర పూర్తి చేసిన పవన్ కళ్యాణ్ ఆగస్ట్ 10 వ తేదీ నుంచి విశాఖపట్నం నుంచి మూడోవిడత ప్రారంభించనున్నారు. ఓవైపు వారాహి టూర్ మధ్యలో పార్టీ నేతలతో సమావేశాలు, జాయినింగ్స్.. ఇలా జనసేనలో గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కార్యక్రమాలతో దూసుకెళ్తున్నారు. తాజా సభలు,సమావేశాలతో పూర్తిస్థాయిలో కేడర్ లో మార్పు కనిపిస్తుంది. బీజేపీ కూడా తన బలాన్ని సొంతంగా పెంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది.భారతీయ జనతాపార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీని పరుగులు పెట్టిస్తున్నారు. త్వరలో ప్రజా సమస్యలపై ఒక్కొక్కటిగా ఆందోళన చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రజా ఉద్యమాలు, ప్రభుత్వంపై పోరాటాలతో బీజేపీ కేడర్ ను మళ్లీ యాక్టివ్ చేసే పనిలో ఉన్నారు పురంధేశ్వరి. గత ఎన్నికల్లో వచ్చిన ఓటింగ్ పర్సంటేజిని భారీగా పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నారు. కమలానికి కొత్త దళపతి రాకతో పార్టీ శ్రేణుల్లో ఎలక్షన్ మూడ్ కనబడుతుంది.

**పొత్తుల సంగతి తర్వాత ముందు జనంలోనే ఉండాలంటున్న నేతలు.**

ఆంధ్రప్రదేశ్ లో 2024 ఎన్నికలు గతానికంటే భిన్నంగా జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల్లో రికార్డు స్థాయిలో మెజారిటీ సాధించడంతో వైఎస్సార్ సీపీని ఢీకొట్టడం ఇతర పార్టీలకు అంత సులువు కాదు. దీంతో వైసీపీని గద్దె దించేందుకు పొత్తులు తప్పనిసరని జనసేన, తెలుగుదేశం పార్టీలు చెబుతున్నాయి. ప్రస్తుతం బీజేపీ-జనసేన పొత్తు ఉన్నప్పటికీ రెండు పార్టీలు కలిసి ఎలాంటి పోరాటాలు చేయడం లేదు. అయితే పొత్తుల సంగతి ఎలా ఉన్నప్పటికీ ఎవరికి వారు సొంతంగా వారి బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. దీనికోసం వీలైనంత ఎక్కువగా ప్రజల్లోనే ఉండేలా అన్ని పార్టీలు నిర్ణయించాయి. వైసీపీ మాత్రం తాము సింగిల్ గానే వెళ్తామని ఇప్పటికే క్లారిటీ ఇచ్చేసింది. కానీ బీజేపీ, టీడీపీ, జనసేనలు మాత్రం పొత్తుల విషయంలో ఎన్నికల సమయం వరకూ వేచి చూసే ధోరణిలో ఉన్నాయి. మరి మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తాయా? లేక ఏయే పార్టీలు కలిసి వెళ్తాయనేది ఇప్పుడే అవసరం లేదంటున్నారు ఆయా పార్టీల నేతలు.

## టమోటా @ 63

అనంతపురం, చిత్తూరు, కర్ణాటక రాష్ట్రం నుంచి నగరానికి అధిక దిగుబడి వస్తోంది. మరోవైపు రాష్ట్రంలోని రంగారెడ్డి, వికారాబాద్, చేవెళ్ల, నవాబ్‌పేట, మెదక్ జిల్లాల నుంచి కూడా పెద్ద మొత్తంలో మార్కెట్‌కు టమాటా రావడంతో ధరలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఆగస్టు నెలాఖరుకు కిలో రూ.50లోపు చేరుకునే అవకాశం ఉందని వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

మార్కెట్లో డిమాండ్ ఆధారంగా ధరల నిర్ణయం హైదరాబాద్‌కు దిగుబడి అవుతోన్న టమాటా హెూల్‌సేల్ మార్కెట్లో డిమాండ్ ఆధారంగా ధరలు నిర్ణయిస్తారు. నాణ్యతను బట్టి మొదటి, రెండో రకంగా విభజించి వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు ధర నిర్ణయిస్తారు. నిర్ణయించిన ధర ప్రకారమే రైతుబజార్లలో అమ్మాలని ఆదేశిస్తారు. ఐతే వ్యాపారులు మాత్రం అన్ని రకాల టమాటాలకు ఒకే విధమైన ధర తీసుకుంటున్నారు. ధరల పట్టికలో కూడా మొదటి రకానికి చెందిన ధరలనే మార్కెట్లో ప్రదర్శిస్తారు. దీంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు మొదటి రకం టమాటా కిలో రూ. 63 నిర్ధారించి బోర్డుల్లో పేర్కొన్నారు. రైతుబజార్లలో ఈ మేరకు ధరల పట్టీ పెట్టినా దుకాణదారులు కిలో రూ.100 లకు ఏమాత్రం తగ్గకుండా అమ్ముతున్నారని మార్కెట్‌లకు వెళ్లే కొనుగోలు దారులు వాపోతున్నారు.

అటు ఏపీలోనూ మార్కెట్‌లలో ధరలు రూ.100 నుంచి రూ.65 వరకు తగ్గిపోయాయి. అనూహ్యంగా ధర తగ్గడంతో రైతుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. మార్కెట్‌లలో టమాటా ధరలు తగ్గినా ఇతర రాష్ట్రాలకు మాత్రం ఎగుమతులు జోరందుకున్నాయి. అనంతపురం మార్కెట్‌లో మొదటి రకం టమాట కిలో రూ.110, రెండో రకం రూ.90, మూడో రకం రూ.75 చొప్పున పలికాయి. 15 కిలోల బుట్ట మొదటి రకం రూ.1650, రెండో రకం రూ.1350, మూడో రకం రూ.1125 చొప్పున ధర పలికింది. మరోవైపు అన్నమయ్య జిల్లాలోనూ రెండు రోజులుగా టమోటా ధరలు తగ్గుతూ వస్తున్నాయి. 23 కేజీల బాక్సు ధర ఆదివారం టమాటా నాణ్యతను బట్టి రూ.1500 నుంచి రూ.2300 వరకు ధర పలికింది.

# విశాఖ సమాచారమ్

బుధవారం 09-08-2023


## వేతనాలకై పోరాటాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక స్థాయిలో వేతనాలు, పెన్షన్లు పొందుతున్న వారు విద్యుత్‌శాఖ ఉద్యోగులు మాత్రమే. కార్యాలయం శుభ్రపరిచే అటెండెంట్ కనీస వేతనం లక్షకు పైగా ఉంది. గెజిటెడ్ అధికారి స్థాయిలో పదవీ విరమణ చేసిన వారి పెన్షన్ నెలకు లక్షకు పైమాటే. ఇవి కాక అనేకరకాల ఇతర అలవెన్స్‌లు, ప్రయోజనాలు వారు పొందుతున్నారు. విద్యుత్‌శాఖ ఇప్పుడు బాగా సాంకేతికంగా అభివృద్ధి చేయబడింది. ప్రధాన నగరాలలో భూగర్భ విద్యుత్ సరఫరా ప్రారంభమయ్యాక దాదాపుగా సరఫరాలోని అంతరాయాలు, అధిక ఓల్టేజీ సమస్యలు పరిష్కారమయ్యాయి. అయితే అత్యధిక స్థాయిలో విద్యుత్ వినియోగఛార్జీలు ఏపీలో మాత్రమే అమలులో ఉన్నాయి. ఇవికాకుండా సర్దుబాటు పేరుతో సంవత్సరం పొడవునా ఆ శాఖకు జరిగిన లావాదేవీలలో నష్టంగా లెక్కించబడిన మొత్తాన్ని వినియోగదారుల నుండి బలవంతంగా వసూలు చేస్తున్నారు.

ఇంత అధికమైన జీతాలు పొందుతూ కూడా ఇంకా అనేకరకాల డిమాండ్లతో విద్యుత్‌శాఖ ప్రభుత్వాన్ని బెదిరిస్తోంది. నేటినుండి నిరవధిక సమ్మెకూడా చేయబోతున్నట్లు వారు ప్రకటించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న పనిని ప్రైవేటు నిర్వహణ సంస్థకు అప్పగిస్తే కరెంట్ బిల్లులు సగానికి సగం తగ్గిపోతాయని విద్యుత్ రంగ నిపుణులు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం అధిక ధరకు సోలార్ విద్యుత్ కొనుగోలు చేయడం వెనుక ఎంతో అవినీతి చోటుచేసుకుందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా వాటిపై ఎటువంటి సమీక్షలు లేదా విచారణలు జరగడం లేదు. మరోవైపు మొన్నటిదాకా కలిసి ఉన్న తెలంగాణా రాష్ట్రం వినియోగించిన విద్యుత్ బకాయిలు మన రాష్ట్రానికి ఆరువేల కోట్లు వరకు తొమ్మిదేళ్లుగా చెల్లించకుండా కేసీఆర్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది.

విద్యుత్ శాఖ సిబ్బంది ఎంత భారీ వేతనాలు పొందుతున్నప్పటికీ కొందరు ఉద్యోగుల చేతివాటం కారణంగా ఆ శాఖ అప్రదిష్టపాలవుతోంది. గతంలో ఎంతోమంది అవినీతి నిరోధక శాఖకు చిక్కి ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. కొత్త కనెక్షన్ కావాలన్నా, కనెక్షన్ రద్దు చేసుకోవాలనుకున్నా ముడుపులు తప్పడం లేదు. రద్దు చేసుకున్న సర్వీసుకు సంబంధించి చెల్లించిన డిపాజిట్లను ఆ శాఖ వినియోగదారులకు తిరిగి చెల్లించడం లేదు. మరోవైపు ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా నిర్మించిన భవనాలకు, వ్యాపార బడ్డీలకు చట్టవ్యతిరేకంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేస్తున్నారు. వీటి కారణంగా తాము అక్కడ నివాసం ఉన్నట్లు లేదా వ్యాపారం చేసుకుంటున్నట్లు ఆధారాలు చూపించి ఆయా ఆక్రమణదారులు స్థలాన్ని సొంతం చేసుకోవడానికి కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ భారీగా వేతనాలు లభిస్తున్నాయి. అయినప్పటికీ వీరిలో తృప్తి అనేది ఏ కోణానా కానరాదు. తాము ప్రజలకు సేవకులము అనేభావన వీరిలో ఎక్కడా చూడలేము. ప్రజలను బెదిరించడం, ఛీదరించుకోవడం, గొడవకు దిగినవారిని పోలీస్ కేసులు పెట్టి బాధించడం, కొందరు ఉద్యోగులకు పరిపాటిగా మారింది. కొందరు ఉన్నతాధికారులైతే మరీ దౌర్జన్యంగానూ, అక్రమంగానూ ప్రవర్తిస్తున్నారు. అధికారులకు ఇవ్వబడిన అధికారం వారి దిగువ ఉద్యోగులపై చూపించడానికి మాత్రమేనని, ప్రజలపై చూపించేందుకు కాదు అనే ఇంగితజ్ఞానం వీరికి లేదు. ఉన్నతాధికారులు అనగానే తాము ఈ రాష్ట్రానికి యజమానులమని, మొత్తం ప్రభుత్వ ఆస్థులు, ఆదాయాలు తమకు చెందినవేనన్నట్లుగా భావించి ప్రజాధనాన్ని, ఆస్థులను దుర్వినియోగం చేస్తున్నారు. మరికొందరు అధికారులు రాజకీయ నాయకులకు ప్రజాధనాన్ని ఎలా దోచుకోవాలో నేర్పిస్తూ, చట్టాన్ని, నిబంధనలను వారికి అనుకూలంగా మార్చేస్తూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారు.

ఇసుక, ఖనిజాలు, నీటి వనరులు దోపిడీకి గురవుతున్నాయని, వీటిద్వారా అకస్మాత్తుగా జనం కోటీశ్వరులు అయిపోతున్నారని, వీరిని ఆదాయపు పన్నుశాఖ గాని, నిఘా శాఖగాని ఏమీ చేయలేకపోతున్నాయని, అక్రమ ఆర్జనలతో రాజకీయాలలో ప్రవేశించి ప్రజాప్రతినిధులై మరింతగా పీడించుకుతింటున్నారని పలువురు వాపోతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు వాణిజ్యరహితంగా నిర్వహించాల్సి ఉండగా ఆయా సంస్థల వ్యవస్థాపకులు అక్కడ వేతనం పొందుతూనే వందలాది కోట్లు కూడబెట్టి ప్రజాప్రతినిధులుగా చలామణి అవడం మనదేశంలోనే సాధ్యమవుతుంది.

## రైలు కిందపడి యువ దంపతుల ఆత్మహత్య



**తాడిపత్రి:** రైలు కిందపడి యువ దంపతులు వేర్వేరుగా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం భార్య రైలు కిందపడగా.. మంగళవారం ఉదయం భర్త కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు.

రైల్వే పోలీసులు, మృతుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పరిధిలోని చిన్నపొలమడకు చెందిన మంజునాథ్ (26), పొట్లూరి మండలం గరుగు చింతలపల్లి గ్రామానికి చెందిన రమాదేవి (24) ప్రేమించుకున్నారు. 6 నెలల క్రితం పెద్దలను ఒప్పించి వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం తాడిపత్రి సమీపంలోని తెల్లవారిపల్లి వద్ద రమాదేవి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. వరకట్న వేధింపుల వల్లే తమ కుమార్తె చనిపోయిందంటూ ఆమె తల్లిదండ్రులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున తాడిపత్రిలో రైలు కిందపడి మంజునాథ్ కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ప్రేమ వివాహం చేసుకున్న దంపతులు ఏ కారణంతో ఇలా తనువు చాలించారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు సీఐ నాగప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ షర్మిల



హైదరాబాద్: పార్లమెంట్ సభ్యత్వాన్ని తిరిగి పొందిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు. న్యాయం, ధర్మం గెలిచాయనడానికి సుప్రీంకోర్టు తీర్పే ఒక ఉదాహరణ అని ఆమె ట్విటర్ వేదికగా వెల్లడించారు. రాహుల్ గాంధీ తిరిగి పార్లమెంట్‌కి రావడం దేశానికి ఎంతో అవసరమన్నారు. పార్లమెంట్ వేదికగా రాహుల్ గళం వినిపిస్తారని దేశం ఎదురుచూస్తోందన్నారు. అహర్నిశలు ప్రజాస్వామ్య, లౌకికవాద పరిరక్షణ, దేశ భద్రత, ఉన్నతి, ఐక్యతపై ఆయన పోరాట పటిమ ఎంతో ఆదర్శమన్నారు. దేశ భద్రత, ఉన్నతి, ఐక్యతపై నాయకులందరూ కలిసి పోరాడాలన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి బేషరతుగా తన నైతిక మద్దతు తెలియజేస్తున్నానని షర్మిల తెలిపారు.

## 11 నుంచి ఏపీ విద్యుత్ ఉద్యోగుల సమ్మె

అమరావతి: ఎల్లుండి నుంచి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె నిర్వహించనున్నారు. సమ్మెకు సంబందించిన పోస్టర్‌ను విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేతలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా సమస్యలపై చర్చలు జరుపుతున్న ఏపీ ప్రభుత్వం పరిష్కరించడం లేదని మండిపడ్డారు. గత నెల 21వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

రేపు ప్రభుత్వం ఇచ్చిన సిమ్ కార్డులు తిరిగి ఇచ్చేస్తామన్నారు.

12 సమస్యలపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత లేదని చెప్పారు.వేతన సవరణ పేరుతో జీతాలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు.మిగతా ఉద్యోగులతో విద్యుత్ ఉద్యోగులను పోల్చవద్దని హితవు పలికారు. 2022 ఏప్రిల్ నుంచి వేతన సవరణ జరగాల్సి ఉన్నా...జరగలేదని ధ్వజమెత్తారు.వాచ్‌మెన్ నుంచి ఇంజనీర్ వరకూ అందరూ సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగితే ప్రభుత్వం, యాజమాన్యమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు తరలివెళ్లిన టీడిపి నాయకులు



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** నేడు విజయనగరం పురుషోత్తపట్నంలో గల సాగునీటి ప్రాజెక్టుల సందర్శనకు వెళుతున్న టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్వాగతం పలికేందుకు మంగళవారం నాడు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ,యలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్లతో బయల్దేరిన కాన్వాయ్ ను మాజీ ఎంపీ పప్పల చలపతిరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కాన్వాయ్ లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే పోలవరం వచ్చాను

టీడీపీ అధినేత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించి అధికారపక్షంపై విరుచుకుపడగా, ఇవాళ ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కూడా పోలవరం ప్రాజెక్టును సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పోలవరం ప్రాజెక్టు వద్ద నాడు-నేడు పేరిట ఫొటో గ్యాలరీ ద్వారా మంత్రి అంబటి వివరణ ఇచ్చారు.

2019 నాటికి పోలవరం ఎలా ఉంది... ఇప్పుడు ఎలా ఉంది? అనే విషయాలను ఫొటోల ద్వారా వివరించే ప్రయత్నం చేశారు. పోలవరం స్పిల్ వే, కాంక్రీట్ డ్యామ్, అప్రోచ్ చానల్ పనుల పురోగతిపై వివరాలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు నిన్న అబద్ధాలు చెప్పారని అన్నారు. చంద్రబాబు చెప్పిన వివరాలు నమ్మొద్దని, ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకే ప్రాజెక్టు వద్దకు వచ్చానని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాకే పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని తెలిపారు.

గైడ్ బండ్ కుంగడం వల్ల ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. గైడ్ బండ్ కుంగడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గైడ్ బండ్ కు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేయిస్తామని అంబటి పేర్కొన్నారు. స్పిల్ చానల్ దెబ్బతినకూడదనే, డిజైన్ లో లేకపోయినా గైడ్ బండ్ నిర్మించడం జరిగిందని వివరణ ఇచ్చారు.

## హైకోర్టు స్టేను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్

**అమరావతి:** రాజధాని అమరావతిలో R -5 జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌కు న్యాయస్థానం డైరీ నంబర్ కేటాయించింది. వచ్చే శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని ఏపీ ప్రభుత్వ వర్గాలు ఆశిస్తున్నాయి. లేనిపక్షంలో వచ్చే సోమవారం విచారణకు రావచ్చని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

రాజధానిలోని 9 గ్రామాల రైతులు కేవియట్ పిటిషన్‌ను కూడా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన విషయం తెలిసిందే. తమ వాదనలు కూడా వినాలని రాజధాని రైతులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

## నమోదు అయిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలి

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో నమోదు అయిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరు డా. కృతికాశుక్లా ఉదయం 10:30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి 13 మంది వివిధ సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టరుకు నేరుగా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికాశుక్లా మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నమన్నారు. ఫోన్ ద్వారా తెలియజేసిన 13 మంది వ్యక్తుల సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. అధికారులు డయల్ యువర్ కలెక్టర్ కార్యాలయంలో నమోదైన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పరిష్కరించాలని కలెక్టరు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసు వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విమానాల ద్వారా అమెరికాకు దానిమ్మపండ్ల ఎగుమతి

**విజయవాడ, (పీఐబీ):** పండ్ల ఎగుమతుల అవకాశాలను పెంపొందించేందుకు, వాణిజ్యం మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే వ్యవసాయ మరియు ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎపెడా), తాజా దానిమ్మపండును విమానాల ద్వారా అమెరికా కి మొదటి ట్రయల్ షిప్‌మెంట్‌ను ఎగుమతి చేయడానికి సులభతరం చేసింది. అమెరికాకి దానిమ్మపండు యొక్క మొదటి ఎగుమతి సరుకును ఎపెడా చెందిన నేషనల్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ (NPPO), అమెరికా యొక్క యానిమల్ ప్లాంట్ హెల్త్ ఇన్‌స్పెక్షన్ సర్వీస్ (అమెరికా-ఏ పీ హెచ్ ఐ ఎస్), మహారాష్ట్ర స్టేట్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ బోర్డ్ , ఐకార్ దానిమ్మపై జాతీయ పరిశోధన కేంద్రం, షోలాపూర్ (ఎన్ఆర్సీ-సోలాపూర్) మరియు ఇతరులు సహకారంతో ప్రారంభించింది.

ఎపెడా చైర్మన్ అభిషేక్ దేవ్ మాట్లాడుతూ అమెరికాకి దానిమ్మపండు ఎగుమతులు పెరగడం వల్ల అధిక ధర లభిస్తుందని మరియు రైతుల ఆదాయం పెరుగుతుందని అన్నారు. దానిమ్మ షిప్‌మెంట్‌కు దిగుమతిదారుల నుంచి ప్రోత్సాహకరమైన స్పందన వస్తోంది.

భారతదేశం నుండి పండ్లు మరియు కూరగాయల ఎగుమతి చేసే అగ్రగామిగా ఉన్న ఎపెడా రిజిస్టర్డ్ '. ఐ ఎన్ ఐ ఫార్మ్స్' ద్వారా దానిమ్మపండు యొక్క ట్రయల్ షిప్‌మెంట్ జరిగింది. ఇది నేరుగా రైతులతో పని చేయడం ద్వారా అరటి మరియు దానిమ్మ యొక్క విలువ గొలుసు వ్యవస్థ ను నిర్మించింది. ఆగ్రోస్టార్ గ్రూప్‌లో భాగమైన ఐ ఎన్ ఐ ఫార్మ్స్ ప్రపంచవ్యాప్తంగా 35 దేశాలకు ఎగుమతి ఉత్పత్తులతో రైతులకు వ్యవసాయ శాస్త్రం, వ్యవసాయ-ఇన్‌పుట్‌లు మరియు ఆఫ్-టేక్ పూర్తి సేవలు అందిస్తోంది. సుదూర మార్కెట్ మరియు అధిక ధర తో కూడిన ఎగుమతి వాణిజ్య కార్యకలాపాల నేపథ్యంలో దానిమ్మపండు యొక్క ట్రయల్ షిప్‌మెంట్ ఎగుమతి నాణ్యమైన పండ్లను ఎగుమతి చేసేలా ద్వారా భారతీయ ఎగుమతిదారులు మరియు అమెరికా దిగుమతిదారులలో సామర్థ్యాలను పెంపొందించడంలో సహాయపడుతుంది.

అమెరికా మార్కెట్‌లలో భారతీయ మామిడి పండ్లకున్న గిరాకీ పట్ల ఉత్సాహంగా ఉన్న ఎగుమతిదారులు యుఎస్ఎలో దానిమ్మ కూడా విజయవంతమైన ఉత్పత్తి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దానిమ్మ ఎగుమతి విలువ గొలుసులో ట్రేసబిలిటీని నిర్ధారించడం కోసం, ఎపెడా చే అభివృద్ధి చేయబడిన వ్యవస్థ అయిన అనార్ నెట్ కింద వ్యవసాయ క్షేత్రాలను నమోదు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎపెడా రోజా ప్రచార చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అమెరికా మరియు ఆస్ట్రేలియాలో అధిక నాణ్యత గల భారతీయ దానిమ్మలను అనుమతించడానికి మార్గాన్ని సుగమం చేయడం ద్వారా మార్కెట్ యాక్సెస్‌ను పొందడంలో ఎపెడా గణనీయమైన పాత్ర పోషించింది.

అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ మరియు సూపర్ ఫ్రూట్ లక్షణాల కారణంగా, మహారాష్ట్ర నుండి 'భగ్వా' దానిమ్మ గణనీయమైన ఎగుమతి సామర్థ్యాన్ని కలిగి ఉంది. 'భగ్వా' రకానికి చెందిన దానిమ్మకు ఓవర్సీస్ మార్కెట్‌లో గణనీయమైన డిమాండ్ ఉంది. దేశం నుండి దానిమ్మ ఎగుమతిలో మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా దాదాపు 50 శాతం వాటాను అందిస్తుంది.

2022-23లో, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), బంగ్లాదేశ్, నేపాల్, నెదర్లాండ్స్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, బహ్రెయిన్, ఒమన్ వంటి దేశాలకు 58.36 మిలియన్ డాలర్ల విలువైన 62,280 మెట్రిక్ టన్నుల దానిమ్మ ఎగుమతి చేయబడింది. ఉద్యాన పంటల ఉత్పత్తిలో భారతదేశం రెండవ స్థానంలో ఉంది. 2021-22లో, భారతదేశం మొత్తం 333.20 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉద్యాన పంటల ఉత్పత్తిని నమోదు చేసింది, అందులో పండ్లు మరియు కూరగాయల వాటా 90%. 2021-22లో పండ్ల మొత్తం ఉత్పత్తి 107.10 ఎం ఎం టీ మరియు దానిమ్మ సుమారు 3 ఎం ఎం టీ. ప్రపంచంలో దానిమ్మ ఉత్పత్తిలో భారతదేశం ఏడవ స్థానంలో ఉంది మరియు మొత్తం సాగు విస్తీర్ణం 2,75,500 హెక్టార్లు. భారతదేశంలో, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, రాజస్థాన్ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రధాన దానిమ్మ పండించే రాష్ట్రాలు. ఎపెడా దానిమ్మ ఎగుమతులకు ప్రోత్సాహాన్ని అందించడానికి మరియు సరఫరా గొలుసులోని అడ్డంకులను తొలగించడానికి దానిమ్మ కోసం ఎగుమతి ప్రమోషన్ ఫోరమ్(ఈ పీ ఎఫ్) లను ఏర్పాటు చేసింది. ఈ పీ ఎఫ్ లో వాణిజ్య శాఖ, వ్యవసాయ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ రిఫరల్ లేబొరేటరీలు మరియు ఉత్పత్తి యొక్క తొలి పది ప్రముఖ ఎగుమతిదారుల ప్రతినిధులు ఉన్నారు. ఎపెడా దానిమ్మపండు విలువ గొలుసుకు ముందు ఉత్పత్తి, ఉత్పత్తి, పంట అనంతర, లాజిస్టిక్స్, బ్రాండింగ్ నుండి మార్కెటింగ్ కార్యకలాపాల వరకు సమస్యలను పరిష్కరించడానికి నిరంతర ప్రక్రియలో అనేక కార్యక్రమాలు చేపట్టింది. అంతేకాకుండా, ప్రైవేట్ రంగంలో 250 కంటే ఎక్కువ ఎగుమతి ఆధారిత యూరోపియన్ యూనియన్ కంప్లైంట్ ప్యాక్ హౌస్‌లను స్థాపించడంతోపాటు, ఎగుమతుల కోసం ఉమ్మడి మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక సహాయం కూడా అందించబడింది. ఎపెడా నిర్దిష్టదేశం లో ఎగుమతి ప్రచార కార్యక్రమాల కోసం వ్యూహాలను రూపొందించింది. కొత్త మార్కెట్లలో ఎగుమతి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు యురోపియన్ దేశాలు, మధ్యప్రాచ్యం మరియు ఆగ్నేయాసియా దేశాల కోసం అంతర్జాతీయ కొనుగోలుదారుల అమ్మకందారుల సమావేశాలను నిర్వహించింది. వ్యవసాయ మరియు ప్రాసెస్ చేయబడిన ఆహార ఉత్పత్తుల ఎగుమతుల కోసం వివిధ దేశాలలో బీ 2 బీ ప్రదర్శనలు నిర్వహించడం, ఉత్పత్తి-నిర్దిష్ట మరియు సాధారణ మార్కెటింగ్ ప్రచారాల ద్వారా కొత్త సంభావ్య మార్కెట్‌లను అన్వేషించడం వంటి వ్యవసాయ మరియు ప్రాసెస్ చేయబడిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి ప్రమోషన్ కోసం భారత రాయబార కార్యాలయాల క్రియాశీల ప్రమేయం ద్వారా ఎపెడా తీసుకున్న వివిధ కార్యక్రమాల ఫలితం. ఎపెడా అస్సాంలోని గౌహతిలో ఈశాన్య రాష్ట్రాల నుండి సహజ, సేంద్రీయ మరియు జీ ఐ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యాన్ని పెంచడంపై ఒక సమావేశాన్ని కూడా నిర్వహించింది. అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానాలను సృష్టించడం ద్వారా అస్సాం మరియు పొరుగు రాష్ట్రాల్లో పండించే సహజ, సేంద్రీయ మరియు జీ ఐ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడం ఈ సదస్సు యొక్క లక్ష్యం.

లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతం సహకారంతో, ఎపెడా ఇటీవల ఒక అంతర్జాతీయ కొనుగోలుదారుల అమ్మకందారుల సమావేశాన్ని నిర్వహించింది. లడఖ్ నుండి నేరేడు పండ్లు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. లడఖ్ మరియు జమ్మూ మరియు కాశ్మీర్‌లోని యూ టీ లకు చెందిన పద్దెనిమిది మంది వ్యవస్థాపకులు ఆప్రికాట్లు మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల శ్రేణిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భారతదేశం, అమెరికా, బంగ్లాదేశ్, ఒమన్ మరియు యూ ఏ ఈ నుండి 20 మంది కొనుగోలుదారులు పాల్గొన్నారు.

# నువ్వులతో ప్రయోజనాలెన్నో !



మనం ఎదుర్కొనే అనారోగ్యాలకు 90 శాతం పరిష్కారం మనం తినే ఆహారంలోనే ఉంటుంది. అందులోనూ ఇంటిలో వండే వంటలకు ఉండే ఆరోగ్య రహస్యాలే వేరు. కానీ చాలా మంది ఇంటి ఫుడ్ కంటే బయట ఫుడ్‌కే మక్కువ చూపిస్తారు. కొందరికి ఈ విషయం తెలియక పొరపాట్లు చేస్తే కొందరు తెలిసి కూడా లేనిపోని అనారోగ్యాల బారిన పడుతుంటారు. ఉదాహరణకు పీసీఓడీ. 80 శాతం మహిళలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇందుకు నువ్వులు చక్కటి పరిష్కారం. రోజూ నువ్వులు తింటే పీసీఓడీ సమస్య తగ్గడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

నువ్వుల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒక టేబుల్ స్పూన్ నువ్వులు అంటే 10 గ్రాముల నువ్వుల్లో 4శాతం ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అలాగే ఊబకాయం, టైప్ 2 షుగర్ రాకుండా నియంత్రిస్తుంది.

రోజూ క్రమం తప్పకుండా ఒక స్పూన్ నువ్వులు తింటే గుండె జబ్బులకు కారణమయ్యే అధిక కొలెస్ట్రాల్స్, ట్రై గ్లిజరైడ్ లు తగ్గుతాయి.

నువ్వుల్లో 15 శాతం సాచురేటెడ్, 41 శాతం పాలీ అన్ శాచురేటెడ్, 39 శాతం మోనో శాచురేటెడ్ కొవ్వులు కలిగి ఉంటాయి. మోనో శాచురేటెడ్ కొవ్వులు.. గుండెజబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

వేయించిన నువ్వులు తింటే.. వాటిలో ఉండే అక్సలేట్, ఫైటేట్ లు జీర్ణక్రియ, ప్రొటీన్ అబార్షన్ ఆటంకాలను తగ్గిస్తాయి.

నువ్వుల్లో జంతువుల్లో ఉండే అమినో ఆసిడ్ కూడా దొరుకుతుంది. శాకాహారులకు ఇది మంచి ఆహారం.

నువ్వులలో ఉండే లిగ్నాన్స్, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు రక్త ప్రవాహానికి సహాయపడుతాయి. వీటిలో ఉండే మెగ్నీషియం రక్తపోటును తగ్గిస్తుంది.

ఎముకల పెరుగుదలకు నువ్వులు మంచి ఆహారంగా ఉంటాయి. పొట్టు తీయని నువ్వుల్లో కాల్షియం అధికంగా ఉంటుంది.

రోజూ ఒక స్పూన్ నువ్వులు తినడం అలవాటు చేసుకుంటే.. బరువు తగ్గి శరీరం బిగుస్తుంది. అలాగే నడుం నొప్పి, రుతుక్రమం సమయంలో కడుపునొప్పి రాకుండా ఉంటాయి.

నువ్వులు తింటే థైరాయిడ్ కూడా తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. వీటిలో ఉంటే సెలీనియం థైరాయిడ్ హార్మోన్లను బ్యాలెన్స్‌డ్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. అందుకు అవసరమైన ఐరన్, విటమిన్ బి6 లను నువ్వులు సరఫరా చేస్తాయి.

# తల్లిపాలలో తెలియని మర్మాలెన్నో !



తల్లిపాలు పిల్లలకు ఎంతో మేలు చేస్తాయి. ప్రతి ఒక్క బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు తల్లిపాలు కచ్చితంగా అవసరం. ఈ ఆరు నెలలు తల్లిపాలు తప్ప మరొకటి ఇవ్వద్దని చెప్తుంటారు. తల్లిపాల గొప్పతనం గురించి పరిశోధనలో మరో గొప్ప సంగతి బయట పడింది. తల్లిపాలలో మేయో-ఇనాసిటోల్ అనే చక్కెర పుష్కలంగా ఉంటుంది. ఇది నవజాత శిశువుల మెదడు ఎదుగుదలకు ఉపయోగ పడుతుంది. ఈ విషయాన్ని టిఫ్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఈ మధ్యకాలంలో మహిళలు అందం తగ్గిపోతుందని పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం మానేస్తున్నారు. అలాంటి వారి పిల్లలు భవిష్యత్తులో ఆరోగ్య పరంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారంటున్నారు నిపుణులు. ఎందుకంటే తల్లిపాలు పిల్లలకు ఎంతో మేలు చేస్తాయి.

పుట్టినప్పటి నుండే మెదడులోని అనుసంధానాలు ఏర్పడుతుంటాయి దానికి తోడు మెరుగుపడుతూ వస్తుంటాయి. దీనివల్ల జెన్యు పరమైన అంశాలతో పాటు, జీవితంలో ఎదురయ్యే ఎన్నో అనుభవాలుకు దారి చూపుతుంటాయి. శిశువుల్లో తల్లిపాలు ముఖ్య పాత్రను పోషి స్తాయి, సూక్ష్మ పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. శిశువులలో వివిధ దశలో మెదడు ఎదుగుదలను బట్టి తల్లిపాలలోని పోషకాల మోతాదులు మారిపోతుంటాయి. ఇది మరింత ఆశ్చర్యకరం. శిశువుకి జన్మనిచ్చిన తర్వాత తొలి నెలల్లో తల్లిపాలలో పెద్ద మొత్తంలో మేయో-ఇనాసిటాల్ ఉంటుందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఈ సమయంలోనే సినాప్సెస్ అంటే శిశువుల మెదడులో నాడి అనుసం ధానాలు చాలా వేగంగా ఏర్పడతాయి. మేయో ఇనాసిటోల్ శిశువుల నాడుల మధ్య ఉన్న అనుసంధానాల పరిమా ణం పెరగడానికి దానికి తోడు వాటి సంఖ్య పెరగడానికి తోడ్పడు తుంది. శిశువు పుట్టిన తొలినాళ్ల రక్తంలోని హాని కలిగించేవి మెదడులోకి చేరకుండా అడ్డుకునే బ్యాక్టీరియా అంత సమర్థంగా పనిచేయదు. దీనివల్ల శిశువు మెదడు అహారానికి చాలా ఎక్కువగా స్పందిస్తుండ వచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఏ దశల్లో ఎంత మేయో-ఇనాసిటాల్ అవసరమనేది తేలకపోయిన, మొత్తానికి మెదడు సంపూర్ణ ఆరోగ్యానికి మంచి ఫలితాలు చూపిస్తుండటం గమనించాల్సిన విషయం. అంతేకాకుండా శాస్త్రవేత్తల పరిశీలనతో మెరుగైన పాలపొడి తయారీకి ఈ అధ్యాయం మంచి ఫలితాలకు ఎంతో తోడ్పడతాయని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. ఇక ఇప్పుడైనా అందం గురించి ఆలోచించకుండా, పిల్లలకు తల్లి పాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉండటమే కాకుండా మెదడుకి ఎంతో మేలు చేస్తుందని తెలుసుకోవాలి.

# రోజు పరగడుపున ఆ ఒక్కటి తింటే సమస్యలకు చెక్ పెట్టినట్టే



ప్రతి భారతీయుడి కిచెన్‌లో తప్పకుండా లభించే మసాలా దినుసు లవంగం. లవంగాన్ని వివిధ రకాల వంటల్లో రుచి, వాసన కోసం వినియోగిస్తుంటారు. కానీ దీంతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలున్నాయని చాలామందికి తెలియదు. ఇదొక సూపర్ ఫుడ్ లాంటిది. నిత్యం ఎదుర్కొనే చాలా సమస్యలకు దీంతో పరిష్కారం లభిస్తుందంటారు ఆరోగ్య నిపుణులు. ఆ వివరాలు తెలుసుకుందాం..

మనిషి ఎదుర్కొనే వివిధ రకాల అనారోగ్య సమస్యలకు పరిష్కారం ప్రకృతిలో లభించే పదార్థాల్లోనే ఉంది. సాధారణంగా భారతీయులు ఎక్కువగా ఉపయోగించే మసాలా దినుసులు ఆరోగ్యపరంగా చాలా మేలుచేకూరుస్తాయి. ఇందులో లవంగం కీలకమైందిగా చెప్పాలి. మన చుట్టూ లభించే వస్తువులు లేదా పదార్థాలతో ఆరోగ్యాన్ని చాలా వరకు సంరక్షించుకోవడమే కాకుండా ఫిట్‌గా ఉండవచ్చు. లవంగంతో ఆరోగ్య ప్రయోజనాలతో పాటు బరువు కూడా తగ్గించుకోవచ్చు. రోజూ పరగడుపున లవంగం తినడం వల్ల చాలా లాభాలున్నాయి. పరగడుపున లవంగం తీసుకుంటే ఆరోగ్య పరంగా కలిగే లాభాలేంటో చూద్దాం.

అన్నింటికంటే ముఖ్యమైనది బరువు తగ్గించుకోవడం. మీ బరువు తగ్గించాలంటే లవంగం అద్భుతంగా పనిచేస్తుంది. ఉదయం వేళ సాధారణంగా శరీరం మెటబోలిజం తక్కువగా ఉంటుంది ఈ పరిస్థితుల్లో లవంగం తినడం వల్ల మెటబోలిజం వేగవంత మౌతుంది. ఎప్పుడైతే మెటబోలిజం వేగవంతమౌతుందో జీర్ణక్రియ మెరుగుపడి క్రమంగా బరువు తగ్గుతారు. లవంగం తిన్న తరువాత గోరువెచ్చని నీరు తాగితే మంచి ఫలితాలుంటాయి.

ప్రస్తుతం ఇమ్యూనిటీ అనేది చాలా అవసరంగా మారింది. లేకపోతే వివిధ రకాల సీజనల్ వ్యాదులు ఇట్టే చుట్టుముడుతున్నాయి. ఇమ్యూనిటీని పటిష్టం చేయడంలో

లవంగం అద్భుతంగా ఉపయోగ పడుతుంది. లవంగం తినడం వల్ల శరీరంలోని విషపదార్థాలు బయటకు తొలగిపోతాయి. దాంతో రక్తం శుద్ధి చెంది శరీరంలో వైట్ బ్లడ్‌సెల్స్ నిర్మాణం సాధ్యమౌతుంది. అంతేకాకుండా లవంగంలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉన్నందున ఇమ్యూనిటీ బూస్టర్‌గా పనిచేస్తుంది.

రోజూ పరగడుపున లవంగం తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా జీర్ణక్రియకు సంబంధిత చాలా సమస్యలు దూరమౌతాయి. ఒకవేళ మీకు గ్యాస్, అజీర్ణం సమస్యలుంటే పరగడుపున లవంగం తినడంతో ఆ సమస్యల్నించి ఉపశమనం పొందవచ్చు. మరో ప్రధానమైన సమస్య పంటి నొప్పి. లవంగంతో ఈ సమస్య నుంచి వేగంగా ఉపశమనం పొందవచ్చు. ఈ విధానం అనాదిగా అమల్లో ఉన్నదే. పంటి నొప్పి తీవ్రంగా ఉన్నప్పుడు 1-2 లవంగాలను పంటి కింద నొక్కిపెట్టి ఉంచుకోవాలి. లేదా లవంగం నూనె కూడా రాసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల పంటి నొప్పి నుంచి చాలా వేగంగా రిలీఫ్ లభిస్తుంది.

# ప్రాణాపాయం కలిగించే డెంగ్యూ జ్వరాన్ని అరికట్టండానికి వంటింటి చిట్కాలు




డెంగ్యూ జ్వరం అనేది ప్రాణాంతక దోమల ద్వారా సంక్రమించే వైరల్ ఇన్ఫెక్షన్. ఇది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం భారతదేశంలో డెంగ్యూ జ్వరం చాలా వేగంగా విస్తరిస్తోంది.

ఇటీవలి కాలంలో డెంగ్యూ కారణంగా మరణాల సంఖ్య ఎక్కువగా నమోదవుతోంది. దీంతో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్న ఈ సమయంలో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. భారతదేశంలో డెంగ్యూ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉన్నందున, లక్షణాలను నిర్వహించడం మరియు రికవరీ ప్రక్రియలో సహాయపడే మార్గాలను కనుగొనడం యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.

వైద్య చికిత్స తప్పనిసరి అయినప్పటికీ, డెంగ్యూ లక్షణాలను తగ్గించడంలో మరియు త్వరితగతిన కోలు కోవడాన్ని ప్రోత్సహించడంలో సాంప్రదాయ గృహ వైద్యాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఈ కథనంలో డెంగ్యూ లక్షణాలను నియంత్రించడానికి సాంప్రదాయ ఇంటి నివారణలను ఎలా ఉపయోగించాలో తెలుసుకోండి.

**బొప్పాయి ఆకు రసం:** డెంగ్యూ ఉన్నవారిలో ప్లేట్‌లెట్ కౌంట్ తక్కువగా ఉండటం ప్రారంభమవుతుంది. ఇది వాస్తవానికి మీకు ప్రమాదకరమైన పరిణామాలను కలిగిస్తుంది. కొన్ని తాజా బొప్పాయి ఆకులను తీసుకుని వాటిని చూర్ణం చేసి రసం తీయాలి. మీ ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడానికి మరియు లక్షణాలను తగ్గించడానికి 2 టీస్పూన్ల సారం రోజుకు రెండుసార్లు తీసుకోండి.

**వేప ఆకు:** వేప ఆకులు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి మరియు డెంగ్యూ జ్వరంతో పోరాడటానికి సహాయపడతాయి. కొన్ని వేప ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ మిశ్రమాన్ని వడపోసి ఈ నీటిని తాగితే రోగ నిరోధక శక్తి చాలా రెట్లు పెరుగుతుంది.

ఇది మీ శరీరం డెంగ్యూ వైరస్‌తో పోరాడేలా చేస్తుంది. అలాగే, డెంగ్యూ జ్వరం వల్ల వచ్చే దురద నుండి ఉపశమనానికి వేపనూనెను స్థానికంగా ఉపయోగించవచ్చు.

**అల్లం:** చిన్న అల్లం ముక్కను గ్రైండ్ చేసి వేడి నీటిలో వేసి మరిగించాలి. అల్లం టీ రుచిని మెరుగుపరచడానికి తేనె మరియు నిమ్మరసం కలపండి మరియు ఈ లక్షణాలను వదిలించుకో వడానికి ఈ అల్లం టీని తాగండి. అల్లంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు చాలా ఉన్నాయి.

ఇవి మంటను తగ్గించడానికి మరియు గొంతు నొప్పిని తగ్గించడానికి సహాయపడతాయి. తేనె మరియు నిమ్మకాయలు మంటను తగ్గించడంలో సహాయపడే సహజ నివారణలుగా పనిచేస్తాయి. నిమ్మకాయలో విటమిన్ సి కూడా ఉంటుంది, ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది.


**పసుపు పాలు:** బంగారు పాలు అని కూడా పిలువబడే పసుపు పాలు మీ శరీరానికి అనేక అద్భుతాలు చేస్తాయి. ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక టీస్పూన్ పసుపు కలపండి. పడుకునే ముందు ఈ అమృతాన్ని తాగండి. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది మరియు కోలుకోవడానికి సహాయపడుతుంది.

పసుపు ఒక శక్తివంతమైన సహజ యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ ఆక్సిడెంట్, ఇది వాపును తగ్గించడానికి మరియు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. వెచ్చని పాలు పసుపును మరింత సులభంగా గ్రహించేలా చేస్తుంది, ఇది రక్తప్రవాహంలోకి వేగంగా చేరుకోవడానికి మరియు మరింత ప్రభావవంతంగా ఉండటానికి సహాయపడుతుంది.

**వెల్లుల్లి:** వెల్లుల్లి యొక్క కొన్ని రేకలను చూర్ణం చేసి, తేనెతో కలపండి. ఈ మిశ్రమాన్ని ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వెల్లుల్లిలో యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ వైరల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి మరియు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. తేనె మంటను తగ్గిస్తుంది మరియు గొంతును ఉపశమనం చేస్తుంది.

డెంగ్యూ కోసం సాంప్రదాయ ఇంటి నివారణలు వైద్య చికిత్సను పూర్తి చేస్తాయి మరియు డెంగ్యూ లక్షణాల నుండి మీకు ఉపశమనం కలిగిస్తాయి. ఏదైనా నివారణను ప్రయత్నించే ముందు ఆరోగ్య సంరక్షణ నిపుణులను సంప్రదించడం ద్వారా మీ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వండి.

# జెస్టేషనల్ డయాబెటిస్ వారికి ప్రత్యేకమైన ఆహారం



మీరు డయాబెటిస్‌తో బాధపడుతూ, స్వీట్లను తినడానికి ఇష్టపడితే, టెన్షన్ ఫ్రీగా ఉండండి మరియు రుచికరమైన మరియు ఆరోగ్యకరమైన ఈ కుకీలను ప్రయత్నించండి. గర్భవతి కావడం నిజంగా ఒక అందమైన అనుభవం. కానీ దాని స్వంత సవాళ్లు లేకుండా కాదు. మధుమేహం ఉన్న మహిళలకు, ఈ సమయంలో వారి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవడం మరింత కీలకం.

అంతే కాదు, గర్భధారణ సమయంలో హార్మోన్ల హెచ్చు తగ్గుల కారణంగా కొంతమంది మహిళలకు మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి సమయంలో, ఆశించే తల్లికి మరియు త్వరలో పుట్టబోయే బిడ్డకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు ఆరోగ్యకరమైన మరియు సమతుల్య ఆహారంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం.

అయితే ఇలాంటి సమయంలో ప్రెగ్నెన్సీ కోరికలు వచ్చినప్పుడు ఏమి జరుగుతుంది? షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉన్నందున, మీరు ఇష్టపడేది ఏదైనా తినలేరు. కాబట్టి, ఏమి చేయాలి? శుభవార్త ఏమిటంటే, మీకు మరియు మీ బిడ్డకు సురక్షితంగా ఉంటూనే మీ కోరికలను తీర్చగల ఆరోగ్యకరమైన స్నాక్స్ పుష్కలంగా ఉన్నాయి.

కాబట్టి తిరిగి కూర్చోండి, విశ్రాంతి తీసుకోండి మరియు మీ గర్భధారణ సమయంలో ఆరోగ్యకరమైన చిరుతిండి ప్రపంచంలోకి ప్రవేశిద్దాం. ఇంకా ఏమిటంటే, మేము మీ అందరికీ స్నాక్స్‌ను భారతీయీకరించాము.

గర్భవతిగా ఉండటం నిజంగా ఒక అందమైన అనుభవం - కానీ దాని స్వంత సవాళ్లు లేకుండా కాదు. మధుమేహం ఉన్న మహిళలకు, ఈ సమయంలో వారి రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడం మరింత కీలకం.

అంతే కాదు, గర్భధారణ సమయంలో హార్మోన్ల హెచ్చు తగ్గుల కారణంగా కొంతమంది మహిళలకు మధుమేహం వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి సమయంలో, ఆశించే తల్లికి మరియు త్వరలో పుట్టబోయే బిడ్డకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు ఆరోగ్యకరమైన మరియు సమతుల్య ఆహారంపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యం.

**డయాబెటిక్ గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యకరమైన స్నాక్స్**

1. కాల్చిన మఖానా (ఫాక్స్‌నట్స్): తక్కువ కేలరీలు మరియు ఫైబర్ అధికంగా ఉండే ఈ కరకరలాడే మరియు తేలికపాటి స్నాక్స్ తినండి. వారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతారని కూడా పిలుస్తారు, ఇది డయాబెటిక్ గర్భిణీ స్త్రీలకు అద్భుతమైన ఎంపిక.

2. మూంగ్ దాల్ చాట్: ఈ ఉప్పగా మరియు రుచిగా ఉండే అల్పాహారం ప్రోటీన్ మరియు ఫైబర్‌తో నిండి ఉంటుంది, ఇది మధ్యాహ్న స్నాక్‌కి సరైన ఎంపిక. మొలకెత్తిన మూంగ్ పప్పు, ఉల్లిపాయలు, టమోటాలు మరియు మసాలా దినుసుల కలయిక సంతృప్తికరమైన మరియు ఆరోగ్యకరమైన స్నాక్ ఎంపికను సృష్టిస్తుంది.

3. వెజిటబుల్ పోహా కట్లెట్స్: ఈ రుచికరమైన కట్లెట్స్ చదునైన అన్నం (పోహా) మరియు మిశ్రమ కూరగాయలతో తయారు చేస్తారు. అవి నిస్సారంగా వేయించినవి, వీటిని డీప్-ఫ్రైడ్ స్నాక్స్‌కు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా మారుస్తాయి. పోహాలో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు ఐరన్ అధికంగా ఉంటుంది, ఇది గర్భిణీ స్త్రీలకు అదర్శవంతమైన చిరుతిండి .

4. కాల్చిన తీపి బంగాళాదుంప ఫ్రైలు: కొన్ని ఫ్రైలను ఆరాటపడుతున్నా, కొవ్వు మరియు కొలెస్ట్రాల్ గురించి ఆందోళన చెందుతున్నారా? బదులుగా ఈ కాల్చిన స్వీట్ పొటాటో ఫ్రైలను ఎంచుకోండి. తీపి బంగాళాదుంపలు ఫైబర్ మరియు విటమిన్ల యొక్క గొప్ప మూలం, మరియు కాల్చినప్పుడు, అవి మధుమేహ గర్భిణీ స్త్రీలకు అపరాధం లేని స్నాక్ ఎంపికగా మారతాయి.

5. బచ్చలికూర మరియు పనీర్ స్టఫ్డ్ పరాటా: భారతీయ వంటకాల్లో పరాఠాలు ప్రధానమైనవి, మరియు ఈ స్టఫ్డ్ వెర్షన్ సాంప్రదాయ వంటకానికి ఆరోగ్యకరమైన ట్విస్ట్‌ను జోడిస్తుంది. బచ్చలికూరలో ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ పుష్కలంగా ఉంటుంది, అయితే పనీర్ ప్రొటీన్‌ను అందిస్తుంది, ఈ స్నాక్‌ను మధుమేహం ఉన్న గర్భిణీ స్త్రీలకు పోషకమైన ఎంపికగా చేస్తుంది.

6. మసాలా కాల్చిన చిక్పీస్: చిక్పీస్, ప్రియమైన చనా, ప్రొటీన్ మరియు ఫైబర్ యొక్క అద్భుతమైన మూలం. చాట్ మసాలా మరియు జీలకర్ర వంటి మసాలా దినుసులతో కాల్చినప్పుడు, అవి మధ్యాహ్నపు కోరికలను తీర్చడానికి సరైన రుచి మరియు క్రంచీ స్నాక్‌గా మారుతాయి.

7. క్యారెట్ స్టిక్స్‌తో దోసకాయ మరియు పుదీనా పెరుగు డిప్: వంట మరియు వేయించడానికి ఇబ్బంది పడకూడదనుకునే గర్భిణీ మమ్మా కోసం, ఇది ఉత్తమ ఎంపిక, చేతులు డౌన్! ఈ రిఫ్రెష్ డిప్ పెరుగు, దోసకాయ మరియు పుదీనాతో తయారు చేయబడింది మరియు క్యారెట్ స్టిక్స్‌తో ఖచ్చితంగా జత చేయబడింది.

పెరుగులో కాల్షియం మరియు ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి, అయితే దోసకాయలు మరియు క్యారెట్లు విటమిన్లు మరియు ఫైబర్ను అందిస్తాయి. మధుమేహం ఉన్న గర్భిణీ స్త్రీలకు ఇది ఆరోగ్యకరమైన మరియు శీతలీకరణ చిరుతిండి ఎంపిక.

డయాబెటిక్ గర్భిణీ స్త్రీ కావడం వల్ల మీరు రుచి లేదా పోషకాహారం విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదు. ఈ ఆరోగ్యకరమైన స్నాక్స్‌తో, మీరు మీ రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతూ రుచికరమైన స్నాక్స్‌ని ఆస్వాదించవచ్చు.

కాబట్టి ఎందుకు వేచి ఉండండి? తెలివిగా అల్పాహారం ప్రారంభించండి మరియు ఆరోగ్యకరమైన గర్భధారణ ప్రయాణాన్ని ఆస్వాదించండి!

## 'ఇదెక్కడి ఖర్మరా బాబూ.. చేతికి ఏది దొరికినా వదల్లేదా..!'



గత కొద్ది రోజులుగా అక్కడ అన్నీ వెరైటీ దొంగతనాలు జరుగుతున్నాయి. ఎవరైనా డబ్బు, నగలు, విలువైన వస్తువులు దొంగతనం చేస్తారు.. ఇక్కడ వరుసగా జరుగుతున్న దొంగతనాలు చూస్తే కొంచెం విచిత్రంగా ,వెరైటీగా ఉంటున్నాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో సింగరేణి ఉద్యోగి కొండల రావు ఇంట్లో గ్యాస్ సిలిండర్ తో ఉన్న స్టౌవ్ ను చోరీ చేశాడు.. ఓ దొంగ. ఈ దొంగతనం కోసం రెక్కీ నిర్వహించి.. ఇంటి ఎదురుగా ఉన్న చెట్టు కింద చాలా సేపు కాపు కాసి.. పట్టపగలు దర్జాగా.. చుట్టంలా ఇంట్లోకి వెళ్ళాడు. వాళ్ళు ఇంట్లో పనిలో నిమగ్నం అయి ఉండగా.. గ్యాస్ సిలిండర్‌ను ఏం చక్కా పట్టుకొని వచ్చాడు దొంగ.

ఆ తర్వాత చెట్టు కింద కొద్దిసేపు నిల్చొని చేతిలో పట్టుకొని దర్జాగా వెళ్ళిపోయాడు. సత్తుపల్లి పట్టణంలో గత కొద్దిరోజులుగా ఏదో ఒక దొంగతనం జరుగుతోంది. విచిత్రంగా, వెరైటీగా ఉంటున్నాయి. అర్థరాత్రి వచ్చి.. ఫ్రూట్స్ బండి మీద ఉన్న ఫ్రూట్స్‌ను చోరీ చేసుకొని వెళ్ళాడు ఓ దొంగ. మొన్నటికి మొన్న మొక్కజొన్న కంకులు అమ్ముకునే మహిళకి చెందిన తోపుడు బండినీ చోరీ చేశాడు మరో దొంగ.

**వెరైటీ దొంగతనాలు వీడియో:**

ఇప్పుడు పట్ట పగలే గ్యాస్ సిలిండర్‌ను దర్జాగా పట్టుకొని వెళ్ళాడు. ఈ వెరైటీ దొంగతనాలు అన్నీ.. సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇవి చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. డబ్బు, విలువైన వస్తువులు కాకుండా ఇవేం దొంగతనాలు.. అసలు ఈ దొంగల ఉద్దేశ్యం ఏంటో తేల్చాలని స్థానికులు చర్చించు కుంటున్నారు. ఆ దొంగ చేసిన పని సీసీ కెమెరాల లో రికార్డ్ అయ్యిందని కనిపెట్టలేక పోయాడు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థాన్ విశాఖపట్నం రైల్వే కమిటీ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగరంలోని అక్కయ్యపాలెం భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థాన్ రైల్వే ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రాఘవేంద్ర ఆసుపత్రి సహకారంతో సాయిసాధలో ప్రత్యేక కంటి శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 70 మందికి పైగా పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు, కళ్లద్దాలను వైద్యులు అందించారు. రైల్వే ఏరియా కమిటీ కన్వీనర్ శ్రీ పి మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ముగిసింది.

## ఇరాక్ లోనూ భారత కంపెనీ నకిలీ దగ్గు మందుల గుర్తింపు




భారత కంపెనీ తయారీ నాసిరకం దగ్గు మందు సేవించి గతేడాది గాంబియాలో 66 మంది చిన్నారులు మరణించిన ఘటన గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు ఇరాక్ లోనూ భారత కంపెనీ తయారు చేసిన నకిలీ దగ్గు మందును గుర్తించారు. ఇందుకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఓ హెచ్చరిక విడుదల చేసింది.

ఈ దగ్గు మందు కలుషితం అయిందని, సేవించడానికి సురక్షితం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. సంబంధిత దగ్గు మందు బ్యాచ్ నంబర్ ను సైతం విడుదల చేసింది. ఈ సిరప్ పేరు 'కోల్డ్ అవుట్'. దీన్ని భారత్ కు చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ ఫోర్ట్స్ ఇండియా ల్యాబొరేటరీస్ తయారు చేసింది. డాబిలైఫ్ ఫార్మా కోసం ఈ దగ్గుమందును తయారు చేసి ఇచ్చింది.

హానికారక డైఎథిలేన్, ఎథిలేన్ గ్లైకాల్ ఈ దగ్గు మందులో అనుమతించే దాని కంటే ఎంతో ఎక్కువ పరిమాణంలో ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. ఈ రెండూ 0.10 శాతం లోపే ఉండాలని, కానీ కోల్డ్ అవుట్ సిరప్ లో 0.25 శాతం, 0.21 శాతం చొప్పున ఉన్నట్టు పేర్కొంది. ఈ ఆరోపణలపై ఫార్మా కంపెనీ ఇంకా స్పందించాల్సి ఉంది. ఈ వరుస ఘటనలు భారత ఫార్మా పరిశ్రమపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయంటూ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కామెరాన్ లో పిల్లల మరణాలకు కారణమైన దగ్గు మందు తయారీని నిలిపివేయాలంటూ, గత నెలలో సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రీమన్ ల్యాబ్స్ ను ఆదేశించడం గమనార్హం.

# రైల్వే స్టేషన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి





**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జోనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ సభ్యులు పూడి రామాచార్యులను పలువురు స్థానికులు కోరారు. సోమవారం సాయంత్రం యలమంచిలి రైల్వే స్టేషన్ ని జెడ్ ఆర్ యూ సిసి సభ్యులు పూడి రామాచార్యులతో పాటుగా డి ఆర్ యూ సిసి సభ్యులు జి.వి.శర్మ సందర్శించారు. ఈసందర్భంగా రైల్వే స్టేషన్లలో నెలకొన్న సమస్యలను సిబ్బందితో పాటుగా పలువురు న్యాయవాదులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యలమంచిలి రైల్వే స్టేషన్లో విశ్రాంతి గదులు,మరుగుదొడ్ల సమస్య ఉందని స్థానికులు తెలియపరచారన్నారు.దానితో పాటుగా కోవిడ్ తర్వాత లోకల్ పాసెంజర్ లేనందున యలమంచిలి నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని,విశాఖపట్నం వరకు లోకల్ పాసెంజర్ ను పునరుద్ధించారాలని కోరారన్నారు.ఇంకా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. వీటన్నింటి పరిష్కారానికి త్వరలోనే ఉన్నతాధికారులకు తెలియజేసి సాధ్యమైనంతవరకు పరిష్కరించే దిశగా మాట్లాడతారన్నారు.కాగా మెమరాండం ఇవ్వడం కొరకై మధ్యాహ్నం నుంచి 4 గంటల వరకు మున్సిపాలిటీకి సంబంధించిన ప్రజాప్రతినిధులు,స్థానికులు వేచి ఉండి అధికారులు రావడానికి ఆలస్యం అవుతుందని తెలుసుకోవడంతో స్టేషన్ సూపరింటెండెంట్ ఆకుల సురేష్ కుమార్ కు మెమరాండం ఇచ్చి వెనుతిరిగారు. న్యాయవాదులు మాత్రం అధికారులు వచ్చే వరకు ఎదురుచూసి సమస్యలపై మెమరాండం అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానికులు, రైల్వే స్టేషన్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# దంపతులను పొట్టన పెట్టుకున్న మందుబాబులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బీచ్ రోడ్ సమీపంలో వినయ్, కిల్లిరావు, కిల్లి భాస్కర్, బాలు, రవి కిరణ్, మణిరాజ్‌లు మద్యం తాగారు. ఆ తర్వాత కారెక్కి రయ్ రయ్ మంటూ దూసుకెళ్లారు. ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ యువకుడితో గొడవపడ్డారు. మైకంలో అతని సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. మరోవైపు భీమిలి నుంచి తెన్నేటి పార్క్ వైపు దంపతులు బైక్‌పై వెళు తున్నారు. వాళ్ల దారిన వాళ్లు వెళ్తుంటే.. అవతలి వైపున కారులో వెళ్తున్న మద్యంబాబులు అతివేగంతో డివైడర్‌ను ఢీకొట్టారు. అవతలి రోడ్డుపై వెళ్తున్న దంపతుల బైక్‌ను ఢీకొట్టారు. ఊహించని ప్రమాదానికి బైక్‌పై వెళ్తున్న ప్రియాంక-పృథ్వీరాజ్ దంపతులు స్పాట్‌లోనే చనిపోయారు.

కారు ఫ్రంట్ సీట్‌లో వినయ్, బాలు, రవి కిరణ్.. బ్యాక్ సీట్‌లో మణిరాజ్, కిల్లిరావ్, కిల్లి భాస్కర్‌లు కూర్చుకున్నారు. అయితే ముందు భాగంలో బెలూన్స్ ఓపెన్ కావడంతో వినయ్, బాలు, రవి కిరణ్‌లు సేఫ్ అయ్యారు. వెనుక సీటులో కూర్చున్న ముగ్గురిలో మణిరాజ్ అనే యువకుడు మాత్రం చనిపోయాడు. ఆరుగురు యువకులు కారులో మద్యం తాగుతూ వెళ్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు.

రోడ్డుపై దాదాపు వందమీటర్ల దూరం దాకా రఫ్ మార్కింగ్స్ కనిపించాయి. బ్రేకులు వేసినా కారు అదుపులోకి రానట్టు క్లియర్ కట్‌గా తెలుస్తోంది. మద్యంమత్తు.. అంతకుమించి ర్యాష్ డ్రైవింగ్.. ముగ్గుర్ని పొట్టనబెట్టుకుంది. స్పాట్‌కి వెళ్లిన సీపీ త్రివిక్రమ్ వర్మ.. ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై స్పెషల్ డ్రైవ్‌లు ముమ్మరం చేస్తామన్నారు. అలాగే పిల్లలపై పేరెంట్స్ నిఘా ఉండాలన్నారు సీపీ.

వారం రోజుల వ్యవధిలో విశాఖలో మూడు ప్రమాదాలు జరిగాయి. ఈనెల 2న వీఐపీ రోడ్డులో పార్కింగ్‌లో ఉన్న వాహనాలపై ఓ కారు దూసుకెళ్లింది. ఈ నెల 5న లెసన్స్ బే కాలనీ నుంచి సిరిపురం వరకు కారు బీభత్సం సృష్టించింది. అప్రమత్తమైన పోలీసులు కారును ఛేజ్ చేసి మరీ పట్టుకున్నారు. ఆ రెండు ఘటనలు మరువకముందే మరో ప్రమాదం అందరి ఒంట్లో వణుకు పుట్టించింది. రిషికొండ బీచ్ రోడ్ ఏరియాలో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ ప్లేస్‌లో ప్రమాదం అందర్నీ ఉలిక్కిపడేలా చేసింది.

తప్పొకరిది.. శిక్ష మరొకరికా? తాగి నడిపినవాళ్లు బాగానే ఉన్నారు. దంపతులు మాత్రం అన్యాయంగా బలైపోయారు. కుటుంబాన్ని బలితీసుకున్న తాగుబోతుల్ని ఏం చేయాలి? ఏం చేస్తే మందుబాబుల్లో మార్పు వస్తుంది?

## 90 ఏళ్ల వయసు.. తీవ్ర అనారోగ్యం.. అయినా వీల్‌చైర్‌లో వచ్చి. మాజీ ప్రధాని నిబద్ధతకు హ్యాట్సాఫ్



"ఆయనకు నిబద్ధత లేదు. వ్యక్తిగా ఆయన మంచిగా ఉంటే సరిపోతుందా? ఆయన చుట్టూ ఉన్న వారిని కూడా మంచిగా ఉంచాలికదా. ఎవరో ఏదో చెబితే.. దాని ప్రకారమే ఆయన చేస్తున్నారు. ఆయనలో నిబద్ధత లేదు. తెగువలేదు"- ఇదీ. 2014కు ముందు ఈ దేశాన్ని 10 సంవత్సరాలపాటు ప్రధానిగా ఉండి ముందుకు నడిపించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురించి అప్పట్లో వినిపించిన వ్యాఖ్యలు, విమర్శలు.

కట్ చేస్తే.. ఇప్పుడు ఆయనకు 90 ఏళ్లు. పైగా.. తీవ్ర అనారోగ్యం. వీల్ చైరే ఇప్పుడు ఆయనకు పట్టుపాన్పు. అంటే.. ఒకరకంగా.. ఇల్లు విడిచి వెళ్లే పరిస్థితి కూడా లేదు. కానీ, ఆయన %--%నిబద్ధత%--%ను చాటుకున్నారు. రాజ్యసభలో ఢిల్లీ సర్వీసుల బిల్లుపై జరిగిన చర్చకు అందరూ పాల్గొనాల్సిందే.. అంటూ మూడంచెల విప్‌ను జారీ చేసిన కాంగ్రెస్ పార్టీకి నిబద్ధులై.. అతికష్టమే అయినా.. అత్యంత మనసు పెట్టి సభకు వచ్చారు. తన నిబద్ధతను చాటుకున్నారు.

ఢిల్లీ సర్వీసులపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొని .. మాట్లాడకపోయినా.. ఆసాంతం అన్నీ వీక్షించారు. చర్చను ఓపికగా ఉన్నారు. వీల్ చైర్‌లోనే ఓ పక్కగా కూర్చుని.. ఓటింగ్ జరిగే వరకు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్దేశాను సారం.. ఆయన ఢిల్లీ బిల్లుకు వ్యతిరకంగా ఓటేశారు. నిజానికి మూడంచెల విప్‌ను జారీ చేయకపోయి ఉంటే.. అనేక మంది యువ ఎంపీలు కూడా డుమ్మా కొట్టేవారనే వాదన వినిపిస్తున్న నేపథ్యంలో వీల్ చైర్‌కే పరిమితమైన మన్మోహన్ వంటివారు.. ఇటు పార్టీకి, అటు.. ఒక రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను చిదిమేస్తున్న వైనానికి అడ్డు కట్టవేసేందుకు నడుం బిగించడం.. సర్వత్రా ఆసక్తిగా మారింది. ఆయనకు దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## ఈనెల 10వ తేదీన రామనారాయణం లో ఉచిత వైద్య శిబిరం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం శ్రీ రామనారాయణం ప్రాంగణం లో 10వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు .ఎన్సిఎస్ చారిటబుల్ ట్రస్ట్ ,మహేంద్ర హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభిస్తారని పేర్కొన్నారు .ఈ వైద్య శిబిరంలో ప్రముఖవైద్యులు సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు, లాపరోస్కోపిక్ జనరల్ సర్జన్‌డాక్టర్ బి. మహేంద్ర గిరి, డాక్టర్ ఎల్. శ్రీనివాసరావు, ప్రసూతి మరియు స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ బి. ప్రశాంతి , సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ కె. జై శంకర్ కృష్ణ పాల్గొంటారని పేర్కొన్నారు . ఈ శిబిరంలో బి.పి., షుగర్, హెమోగ్లోబిన్, ఇ.సి.జి., గుండె పరీక్షలు ఉచితంగా చేయడమే కాక అవసరమగు మందులు ఉచితంగా ఇస్తున్న కారణంగా అందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చెక్కులు అందజేసిన డిప్యూటీ సియం ముత్యాలనాయుడు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని వేచలం గ్రామానికి చెందిన శ్రీ విశ్వబ్రాహ్మణ,శ్రీ విశ్వకర్మ, శ్రీ కామాక్షి దేవి జాయింట్ లైబిలిటీ గ్రూప్ లకు 2,50,00 రూపాయల చొప్పున మూడు చెక్కులను, అదే గ్రామానికి చెందిన వేచలపు లక్ష్మణ ప్రమాదవశాత్తు మృతి చెందగా అతని భార్య అరుణకి 1,00,000-లక్షల రూపాయల బీమా చెక్కును తారువ గ్రామంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి శరారి నాయుడు, బ్యాంక్ చైర్ పర్సన్ రెడ్డి వెంకటకృష్ణ నాయుడు, మైచర్ల నారాయణరావు, వేచలపు సూరిబాబు, పిఎసిఎస్ సీఈవో మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వస్త్రాలకు సరికొత్త ప్రచారం.. లండన్ వీధుల్లో చీరకట్టులో వాక్‌థాన్




లండన్‌లో జరిగిన ప్రారంభ చీరల వాకథాన్‌లో భారత చేనేత వారసత్వంపై అవగాహన కల్పించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గణనీయమైన పాత్ర పోషించిన చేనేత స్వదేశీ ఉద్యమానికి సంఘీభావం తె?లిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది మహిళలు చేనేత వస్త్రాలతో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ట్రాఫల్గర్ స్క్వేర్ నుంచి వెస్ట్ మినిస్టర్‌లోని చారిత్రక పార్లమెంట్ స్క్వేర్ మీదుగా 10 డౌనింగ్ స్ట్రీట్ వరకు ఈ వాకథాన్ సాగింది.

డాక్టర్ దీప్తి జైన్ నేతృత్వంలో బ్రిటిష్ ఉమన్ ఇన్ చీరల బృందం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఇన్‌స్పైరింగ్ డబ్ల్యూ గ్లోబల్ హారో కేర్ మద్దతు ఇచ్చింది. పార్లమెంటు స్క్వేర్‌లో వివిధ రాష్ట్రాల మహిళల సాంప్రదాయ నృత్య ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. పోచంపల్లి, గద్వాల, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ వంటి ప్రముఖ రకాల చేనేత చీరలను భారత మహిళలు ప్రదర్శించారు.

# 15న డా. యాతగిరికి 'మధ్వ' పురస్కారం



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర మధ్వ సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న రాజమండ్రి మల్లిగ సత్రంలో అధికమాసం సందర్భంగా ఉత్తరాధి మఠ పూర్వ యతివరేణ్యులు శ్రీసత్యాధీశతీర్థ స్వామీజీ వంశీకులు మరియు మధ్వమత ప్రచారకర్త, సీనియర్ జర్నలిస్ట్, సమాచారమ్ దినపత్రిక కాకినాడ స్టాఫ్ రిపోర్టర్ డా.యాతగిరి వెంకట పరశు రామ్ దంపతులను సన్మానిస్తున్నట్లు కమిటీ కార్యదర్శి కందాళం నరసింహారావు తెలిపారు.

డా.యాతగిరి క్రమం తప్పకుండా గత రెండున్నర దశాబ్దాలుగా యాతగిరి మధ్వపంచాంగం పేరిట ప్రతి సంవత్సరం మధ్వ పంచాంగాన్ని దేశవాప్తంగా మాధ్వులకు ఉచితంగా అందజేస్తూ విశేషమైన కృషి చేస్తున్నారు. డా.యాతగిరి జర్నలిజం రంగంలో నాలుగు దశాబ్దాలుగా కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్తరాధి మఠ యతవరేణ్యులు శ్రీసత్యప్రమోద తీర్థ స్వామీజీ ఆదేశానుసారం బెంగళూరు నగరంలో ఉన్న శ్రీరఘోత్తమ తీర్థ బృందావనానికి (ప్రస్తుతం నరసింహస్వామి మందిరం) అర్చక బాధ్యతలు గతంలో నిర్వహించేవారు. ఆయన జనకులు, ప్రముఖ జ్యోతిష్య పండితులు కీ.శే. యాతగిరి కృష్ణమూర్తి ఆచార్ నిర్దేశించిన మార్గంలో పయనిస్తూ మాధ్వ గృహస్థులకు అనేక విషయాలలో పలు సూచనలు చేస్తూ శ్రీసత్యాత్మతీర్థ స్వామీజీ ఆదేశాలను త్రికరణశుద్ధితో అమలు చేస్తున్నారు. డా.యాతగిరి జ్యోతిష్య రంగంలోనూ ప్రవేశించి అనేక పురస్కారాలు, ప్రశంసలతోపాటు గౌరవ డాక్టరేట్‌ను స్వీకరించారు. కంప్యూటర్ రంగంలో డిప్లమా చేసారు. గోదావరి తీరమైన రాజమండ్రిలో 1960 ఆగస్ట్ 6న వారి పితామహుల గృహంలో జన్మించారు. సమాచారమ్ దినపత్రికకు రాజమండ్రి, అమలాపురంలలో పాత్రికేయునిగా విశేష సేవలందించి ప్రస్తుతం కాకినాడలో స్టాఫ్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బ్రాహణ సేవాసంఘం, అంతర్జాతీయ బ్రాహణ సేవాసంఘంతో పాటు రోటరి వంటి సంస్థలలో సభ్యునిగా కొనసాగుతున్నారు. కాకినాడ మధ్వసభ కమిటీలో సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

శ్రీసత్యప్రమోదతీర్థ సువర్ణ కరకమలములచే కాకినాడ జర్నలిస్ట్ కాలనీలో శ్రీరమాసహిత సత్యదేవ మందిర ప్రతిష్ఠ చేసి నేటికి సుమారు 28 సంవత్సరాలు పూర్తవుతోంది. నాటి నుండి క్రమం తప్పకుండా డా.యాతగిరి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మందిర రజతోత్సవ సమయంలో శ్రీ దాసాంజనేయ స్వామి సాలగ్రామ విగ్రహప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. డా.యాతగిరి షష్ఠిపూర్తి మహోత్సవ సమయంలో పండిత పరిషత్ మరియు వేదవిజ్ఞాన ప్రతిష్ఠానంచే ఉమాసాంబశివ లింగాన్ని బహుమతిగా పురోహిత బ్రహ్మ డా.రాయప్రోలు ప్రసాదశర్మ అందజేసారు. ఈ మందిర ప్రాంగణంలో నిత్యమూ విశేషమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ గురువుల ఆదేశానుసారం అనేక సత్‌కార్యక్రమాలను అందరి సహకారంతో జరిపిస్తూ భగవద్ అనుగ్రహాన్ని అందజేస్తున్నారు. ఇటీవల ఉత్తరాధి మఠాధీశులు శ్రీసత్యాత్మతీర్థ స్వామీజీ స్వర్ణోత్సవ కానుకగా ఆచరిస్తున్న గీతాఅభయాన్ కార్యక్రమాన్ని డా.యాతగిరిచే నిత్యపఠనం ద్వారా పూర్తి చేసి ఉడిపి పుత్తిగ మఠాధీశులు శ్రీసుగుణేంద్రతీర్థ నాల్గవ పర్యాయ సందర్భంగా కోటి గీతాలేఖన యజ్ఞ కార్యక్రమాన్ని ఆచరణలోకి పెట్టడమేగాక గీతా వైభవాన్ని ప్రవచనాల ద్వారా సమాజానికి అందిస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు 54సార్లు స్వచ్ఛంద రక్తదానాన్ని రెడ్‌క్రాస్, రోటరి సంస్థల నుండి ప్రశంసా పత్రాలను స్వీకరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రం నిర్వహించిన అర్చక పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించారు. పురోహిత రంగంలోనూ విశేష అనుభవం కలిగిన డా.యాతగిరిని శ్రీసత్యాత్మతీర్థ స్వామీజీ ప్రత్యేకంగా అనుగ్రహ పూర్వకంగా వారి స్వగృహంలో శ్రీమూలరామ సంస్థాన పూజను నిర్వహించి విశేషంగా వారి కుటుంబాన్ని ఆశీర్వదించారు.

## మహారాష్ట్రలో మళ్లీ పెరుగుతున్న కొత్త రకం కరోనా కేసులు



కరోనా పేరు పెద్దగా వినిపించక చాలా రోజులు గడిచిపోయింది. కరోనా వైరస్ ఇక పోయినట్టేనని ప్రజలు కూడా భావిస్తున్నారు. కానీ, ఉన్నట్టుండి మహారాష్ట్రలో కరోనా కేసులు పెరగడం మొదలైంది. కరోనా మొదటి, రెండు విడతల్లో దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రలో కరోనా కేసులు, మరణాలు వెలుగు చూడడం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు మరో విడత అదే రాష్ట్రంలో కేసులు పెరగడం మొదలైంది.

ఒమిక్రాన్ ఈజీ.5.1 రకం వైరస్ కేసులు ఇప్పుడు మహారాష్ట్రలో నమోదవుతున్నాయి. దేశంలో ఈ తరహా వేరియంట్ ను గుర్తించడం ఇదే మొదటిసారి. ఈ వేరియంట్ ను మేలో గుర్తించినట్టు జీనోమ్ సీక్వెన్సింగ్ కోర్డినేటర్ డాక్టర్ రాజేష్ కార్యకర్తే తెలిపారు. బీజే మెడికల్ కళాశాలలో ఆయన సీనియర్ సైంటిస్ట్ గానూ పనిచేస్తున్నారు. మే నెలలో గుర్తించిన తర్వాత రెండు నెలలు గడిచిపోయిందని ఎక్స్ బీబీ.1.16, ఎక్స్ బీబీ.2.3 వేరియంట్ల మాదిరిగా దీని ప్రభావం లేదని వెల్లడించారు. అయినా కానీ రాష్ట్రంలో ఇటీవల ఈ కేసులు ఎక్కువగానే నమోదవుతున్నట్టు చెప్పారు.

రాష్ట్ర ఆరోగ్య శాఖ గణాంకాలను పరిశీలించినప్పుడు.. జులై చివరికి 70 కేసులుగా ఉంటే, ఆగస్ట్ 6 నాటికి 115కు పెరిగాయి. ఈ నెల 7వ తేదీ నాటికి 109 కేసులుగా ఉన్నాయి. నిజానికి ఈజీ.5.1 రకం కేసులు వేగంగా పెరుగుతుండడం పట్ల ఇటీవలే బ్రిటన్ ఆందోళన వ్యక్తం చేసింది. మహారాష్ట్రలో అత్యధికంగా ముంబైలో 43 కేసులు, పూణెలో 34 కేసులు, థానేలో 25 చొప్పున యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## ప్రభుత్వ ఖాజి షేక్ అబ్దుల్లాను సత్కరించిన డిప్యూటీ సీయం బూడి



దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా, చీడికాడకు చెందిన షేక్ అబ్దుల్లా ఇటీవల తనకు అనకాపల్లి జిల్లాకు ప్రభుత్వ ఖాజిగ నియమిస్తూ మైనార్టీ మంత్రిత్వశాఖ నుండి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా తారువ గ్రామంలోని డిప్యూటీ సీయం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ని మర్యాదపూరకంగా కలిశారు. అబ్దుల్లా ను మంత్రి సత్కరించి అభినందనలు తెలిపారు.కాగా తను గత పది సంవత్సరాల నుండి కాకినాడ జిల్లా జగ్గంపేట సన్నీ జామియా మసీద్ లో ఇమామ్ గా సేవలు అందిస్తు మసీద్ లో ఎందరో పిల్లలకు అరబిక్, ఉర్దూ నేర్పిస్తూ మంచి విద్యాబుద్దుల నేర్పించారు. ఈ కార్యక్రమంలో చీడికాడ వైసీపీ పార్టీ అధ్యక్షులు రాజబాబు, సీనియర్ నాయకులు సుంకర శ్రీనివాస్, వైస్ ఎంపిపికొండబాబు, మాడుగుల కో ఆప్షన్ సభ్యురాలు ఉన్నిసా, చీడికాడ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు ఎంపీడీఓ ఆఫీసు.. హెల్మెట్లు ధరించి డ్యూటీ చేస్తున్న ఉద్యోగులు



జగిత్యాల జిల్లా బీర్‌పూర్ ఎంపీడీఓ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఉద్యోగులు బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయం పెచ్చులూడిపోతుండంతో నెత్తిమీద ఏదైనా పడొచ్చన్న భయంతో హెల్మెట్లు ధరించి విధులకు హాజరవుతున్నారు. హెల్మెట్లు లేని వారు కార్యాలయం వెలుపలే టేబుళ్లు వేసుకుని పని చేసుకుంటున్నారు.

2016లో బీర్‌పూర్ మండలం ఏర్పడిన నాటి నుంచీ ఎంపీడీఓ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడాది నుంచి పెచ్చులూడటం ప్రారంభించింది. గతేడాది ఎంపీడీఓ మల్లారెడ్డి కూర్చుని ఉండగా ఆయన టేబుల్‌పై పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అప్పటి అదనపు కలెక్టర్ కార్యాలయాన్ని మార్చాలని ఆదేశించారు. కానీ, అమలుకు నోచుకోలేదు. దీంతో, ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయపడిపోతున్న కార్యాలయ ఉద్యోగులు ఇలా హెల్మెట్లు ధరించి విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యాలయం మరో చోటుకు మారాలంటూ సమీపంలోని అంజన్న ఆలయంలో కూడా వారు మొక్కుకున్నారు.

# నాడు కళకళ.. నేడు కరిగిన కల




మూతపడే దశలో..

అరకులోయ, (విశాఖ సమాచారమ్): పర్యటకులకు వినూత్న అనుభవాన్ని కలిగించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'గిరి గ్రామదర్శిని' ప్రయోగం అంతగా ఫలితాన్నివ్వటం లేదు. అరకులోయ మండలం పెదలబుడు సమీపంలో మూడేళ్ల కిందట సుమారు రూ. 60 లక్షల వ్యయంతో 'గిరి గ్రామదర్శినిని' ఏర్పాటు చేశారు. ఇందులో గిరిజనుల మాదిరిగా వేషధారణ, వారి ఆచార సంప్రదాయాల ప్రకారం వివాహాలు జరుపుకోవటం వంటి విభిన్నతలతో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేశారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గిరి గ్రామదర్శినికి మొదట్లో పలువురు ఐఏఎస్ అధికారులు గిరిజన ఆచారాల ప్రకారం వివాహాలు చేసుకొని కొత్త అనుభూతిని పొందారు. ఎంత ఆర్భాటం ఉన్నా పర్యాటకుల మదిని చూరగొనలేకపోతోంది.

సుమారు 20 మంది వరకు గిరిజనులు ఉపాధి పొందాలనే ఉద్దేశంతో గిరి గ్రామదర్శిని రూపకల్పన జరిగింది. పన్యాటకుల తాకిడి ఇక్కడ లేకపోవటంతో ప్రస్తుతం మూతపడే దశకి చేరింది. ఇక్కడ ఉపాధి పొందాలనే ఆశతో వచ్చిన గిరిజనులకూ నిరాశ తప్పలేదు. మూతపడబోతున్న గిరి గ్రామదర్శినిలో చేర్పులు, మార్పులు చేసి తిరిగి పర్యాటకుల మెప్పుని పొందాలనే ప్రయత్నం అధికారుల్లోనూ కన్పించటం లేదు. ఇక్కడికి వెళ్లేందుకు పర్యాటకులకు రవాణా సౌకర్యం లేదన్న ఉద్దేశంతో అప్పటి ఐటీడీఏ పీవో బాలాజీ ప్రత్యేక చొరవ చూపించి ప్రత్యేకంగా ఒక బస్సుని కేటాయించారు. అయినా ఈ ప్రయత్నం నీరుగారిపోయింది. ప్రస్తుతం గిరి గ్రామదర్శినికి కేటాయించిన బస్సు సైతం నిరుపయోగంగా మూలకు చేరింది. రూ. లక్షలు వెచ్చించి రూపొందించిన గిరి గ్రామదర్శినికి మళ్లీ జీవం పోసేందుకు అధికారులు చర్యలు తీసుకోక పోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గిరి గ్రామదర్శినిని పర్యటకులకు పరిచయం చేయటమే లేదు. గిరిజన వెడ్డింగ్ డెస్టినేషన్ పేరుతో దీన్ని పర్యటకులకు చేరువ చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారుల ప్రచార లోపం గిరి గ్రామదర్శినికి శాపంగా మారింది. దీంతో పాటు పర్యటక శాఖ ఆధ్వర్యంలో రోడ్, రైల్ ప్యాకేజీతో పాటు పలు ఇతర ప్యాకేజీల్లో అరకులోయకి పర్యాటకులు వస్తుంటారు. పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారుల సమన్వయ లోపంతో దీన్ని సందర్శించుకునే వెసులుబాటు పర్యాటకులకు లేకుండా పోయింది. పర్యాటక శాఖ ప్యాకేజీల్లో దీనికి చోటు కల్పించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూతపడే దశకి వచ్చిన గిరి గ్రామదర్శినిని తిరిగి కళకళలాడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పలు ప్రాంతాలలో 43 మందిపై టౌన్ న్యూసెన్స్ కేసులు నమోదు

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నగర పోలీస్ కమిషనర్ Dr. సి.యం త్రివిక్రమ వర్మ, ఐ.పీ.ఎస్., వారి ఆదేశాలతో నగర పోలీసు అధికారులు, సిబ్బంది ఇసుక, మద్యం, NDPS కేసులు, పేకాట,కోడి పందాలు వంటి గేమింగ్లు, టౌన్ న్యూసెన్స్ కేసులు, బహిరంగ మద్యపానం వంటి అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు.

ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గేమింగ్ యాక్ట్ నందు ఒక కేసు నమోదు చేసి 05 మందిని అరెస్టు చేసి 63900/- రూపాయల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

నగరంలో పలు ప్రాంతాలలో 43 మందిపై టౌన్ న్యూసెన్స్ కేసులు నమోదు చేశారు.

పోలీసులు, సెబ్ అధికారులు గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాల దుష్పరినామాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. అనుమానిత ప్రదేశాలను, పార్సెల్ గోడౌన్లను మరియు షాపులను తనిఖీ చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 85 మందిపై కేసులు నమోదు చేశారు.

నగరంలో డ్రింక్ అండ్ డ్రైవ్ నందు 79 కేసులు నమోదు చేయబడ్డాయి, ఎం.వి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 2555 కేసులు నమోదు చేశారు.

నగరంలోని మహిళలకు, విద్యార్థినులకు మరియు ప్రజలకు దిశా యాప్ పట్ల అవగాహన కల్పిస్తూ 258 మందితో దిశ యాప్ డౌన్లోడ్ చేయించారు.

నగర పోలీసులు వాహన తనిఖీలు, ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడం, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించడం,దిశా పెట్రోలింగ్,బీచ్ సాండ్ బందో బస్త నిర్వహిస్తూ ట్రాఫిక్ భద్రత నియమాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు.

మహిళా పోలీసులు తమ పరిధిలోని సైబర్ క్రైమ్స్,లోన్ యాప్స్,ఓటిపి ఫ్రాడ్స్ మరియు తక్కువ వడ్డీకి సులభతరమైన లోన్లు ఇస్తామని చెప్పి జరిగే మోసాల పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నగరంలో పెదగంట్యాడ, గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులు వారి సమస్యల కై పోర్టు యాజమాన్యంకి వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళనలు సామరస్య వాతావరణం లో జరిగే విధముగా పటిష్ట బందోబస్తు చర్యలు ఏర్పాటు చేయడం జరిగినది.

సి.పి ఆదేశాలతో నిర్విరామముగా పనిచేయు రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పూర్తి స్థాయి సిబ్బందితో మూడు షిఫ్టుగా నిర్వహించడం జరుగుతుంది. నగరంలోని తగరపువలస మరియు అగనంపూడి సమీపంలో ఏర్పాటు చేసిన ఈ చెక్ పోస్టులు నిరంతరం వాహన తనిఖీలు చేస్తూ ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా నగర భద్రత ను మరింత పటిష్టం చేయడం జరిగింది.

## ప్రజాగాయకుడు గద్దర్ కు నివాళిలర్పించిన ఉక్కు పోరాట కమిటీ



గాజువాక, (విశాఖ సమాచారమ్): ప్రజా గాయకుడు గద్దర్ కి నివాళిని నేడు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటి స్టీల్ ప్లాంట్ సెంట్రల్ స్టోర్ జంక్షన్ వద్దు నిర్వహించారు.

ఈ సభకు స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా వైటి దాస్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువరానిదని ఆయన అన్నారు.

స్టీల్ గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కె యస్ యన్ రావు మాట్లాడుతూ ఏ ఉద్యమంలో నైనా ప్రజలను మమేకం చేసి తద్వారా పోరాటాలను నిర్వహిస్తే ఆ పోరాటం విజయవంతం అవుతుందని ఆయన వివరించారు. ఆ దిశగా గద్దర్ తన జీవిత చరమాంకం వరకు ప్రజా చైతన్యం కోసం కృషి చేశారని ఆయన అన్నారు.

స్టీల్ పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు గణపతి రెడ్డి, రామ్మోహన్ కుమార్, సురేష్ బాబు, పరంధామయ్య, టి జగదీష్, ఓబీసీ అధ్యక్షులు బి అప్పారావు, ఎస్సీ ఎస్టీ అధ్యక్షులు భయ్యా మల్లయ్య మాట్లాడుతూ గద్దర్ తన పాటతో, ఆటతో ప్రజలను చైతన్యపరిచి తద్వారా ఉద్యమాలకు ఊపిరి అందించారని వారు వివరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని తద్వారా బహుజనులకు, పీడిత ప్రజానీకానికి ఉపాధి లభిస్తుందని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె రామకృష్ణ, కామేష్, మహాలక్ష్మి నాయుడు ఇతరులతో పాటు అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## రైతు బజార్ ఏర్పాటు చేయాలని అనకాపల్లి మార్కెట్ కమిటీ సమావేశం తీర్మానం



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ లోనున్న మార్కెట్ కమిటీ పరిపాలన భవనంలో మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు పలకా యశోద రవి అధ్యక్షతన మంగళవారం సర్వసభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు పలు అంశాలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. మార్కెట్ యార్డ్ కు ఇటీవల కాలంలో బెల్లం దిగుబడులు తగ్గు ముఖం పట్టినందున మార్కెట్ యార్డ్ కు బెల్లం దిగుబడులు పెంచే విషయాల్లో గ్రామాల్లో రైతులతో ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. అలాగే అనువైన స్థలంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని సమావేశం తీర్మానించింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ పటాన్ శెట్టి రవి సుభాష్ లతో చర్చించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సమావేశం నిర్ణయించింది. కార్యక్రమంలో. మార్కెట్ కమిటీ కార్యదర్శి డి శకుంతల, కమిటీ ఉపాధ్యక్షులు కరక సోమునాయుడు, డైరెక్టర్లు నీటి పల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తులసి కుమారి, బొడ్డు అచ్చిరాజు, పిట్ట అప్పలరాజు, తెరపల్లి నాగ సంతోష్ కుమార్, దాడి కుమారుడు కృష్ణ, ఒమ్మి మెధుబాబు, కొణతాల విజయ్ కుమారి, గుండా రమేష్ గుప్తా, గొంతిన శివ, ఏడి అగ్రికల్చర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులు



దేహ్రాదూన్: గతరెండు రోజులుగా ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న వర్షాలతో అనేక మంది యాత్రికుల అక్కడ చిక్కుకుపోయారు. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడటంతో వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించాయి. రుషికేశ్‌కు 40కి.మీ దూరంలో వేలాది మంది యాత్రికులు చిక్కుకున్నారు. యాత్రికులు, స్థానికులు రోడ్డుపైనే 20 గంటలుగా పడిగాపులు కాస్తున్నారు. కొడియాల వద్ద 1500 వాహనాలు, 20వేల మంది ప్రజలు ఉండిపోయారు. త్వరగా సహాయక చర్యలు చేపట్టాలని యాత్రికులు విజ్ఞప్తి చేస్తున్నారు. బెంగళూరు, ఏపీ నుంచి వెళ్లిన పలువురు తెలుగు యాత్రికులు కూడా అందులో ఉన్నారు. వారంతా తిరుగు ప్రయాణంలో చిక్కుకున్నారు.

## తాటిపూడి గురుకులంలో ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు ఆకస్మిక తనిఖీలు




విజయనగరం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి కాంతారావు విజయనగరం జిల్లా ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఉదయాన్నే తాటిపూడి వద్ద ఉన్న ఏపీ గురుకులం గర్ల్స్ హై స్కూల్ తనిఖీ చేయగా పలు అంశాలు ఆశ్చర్యాన్ని గురిచేసాయి. వసతి గృహాల వద్ద పరిశుభ్రత లేదు, విద్యార్థులు నిద్రించే గదులలో విద్యుత్ సదుపాయం కొంతమేరకు మాత్రమే ఉంది, సరిగా ఫ్యాన్లు తిరగడం లేదు. ఈ విషయమై కమిషన్ మెంబర్ కొత్తగా ఇంచార్జ్ తీసుకున్నటువంటి ప్రిన్సిపల్ ను హెచ్చరించారు. మళ్లీ ఒకసారి తనిఖీకి వచ్చేసరికి పూర్తిస్థాయిలో పిల్లలందరికీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పక్కన ఉన్నటువంటి ఏపీ రెసిడెన్షియల్ కాలేజ్ విద్యార్థులతో ముచ్చటిస్తూ బంగారు భవిష్యత్తుకి పలు సూచనలు చేశారు.

## పేలిన పెట్రోల్ బంక్.. ఎగిసిపడిన మంటలు



తూర్పుగోదావరి: బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పేలింది. పేలడు ధాటికి భారీ శబ్దం రావడంతో ప్రజలు భయబాంత్రులకు గురయ్యారు.

వివరాల్లోకి వెళితే.. తొస్సిపూడి గ్రామంలోని ఇండియన్ బంక్ ప్రక్కన ఉన్న షెడ్డులో బాణాసంచా నిల్వ ఉంచారు. అనుకోకుండా బాణాసంచా పేలుడు సంభవించడంతో ఆ పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ కూడా బ్లాస్టయింది.

ఉదయం పూట ఈ ప్రమాదం జరగడంతో పెద్దగా జనసంచారం లేకపోవడంతో అదృష్టవశాత్తు ప్రాణ నష్టం తప్పింది. అయితే ఈ ఘటనలో బంక్ ప్రక్కన వున్న గాయత్రి రైస్ మిల్ స్వల్పంగా ధ్వంసమైంది. బంక్ పేలుడుతో భూకంపం వచ్చినట్లు శబ్దాలు వినిపించాయని చుట్టుపక్కల మూడు గ్రామాల్లోని ప్రజలు చెబుతున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఈఏపిసెట్ ఆప్షన్ల ఎంపికకు ఆగస్టు 14 వరకు గడువు పొడిగింపు

ఈఎపిసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో ఆప్షన్ల ఎంపికకు గడువు పొడిగించినట్లు సాంకేతిక విద్యా శాఖ కమీషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. విధ్యార్థుల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 7 నుండి 14 తేదీ వరకు ఎనిమిది రోజులు ఆప్షన్ల ఎంపికకు నిర్ధేశించామన్నారు. తదనుగుణంగా మిగిలిన షెడ్యూలులో కూడా మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఆప్షన్ల మార్పు కోసం 16వ తేదీని కేటాయించామని కన్వీనర్ వివరించారు. ఆగస్టు 23వ తేదీన విద్యార్థులకు అమలులో ఉన్న రిజర్వేషన్లను అనుసరించి అయా కళాశాలల్లో సీట్ల కేటాయింపు ఉంటుందని నాగరాణి స్పష్టం చేసారు. విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలల్లో ఆగస్టు 23 నుండి 31వ తేదీలోపు రిపోర్టు చేయవలసి ఉందన్నారు. ఆగస్టు 31వ తేదీనే క్లాసులు సైతం ప్రారంభం కానున్నాయని విధ్యార్థులు మారిన షేడ్యూలును దృష్టిలో ఉంచుకుని అడ్మిషన్ల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమీషనర్, ఈ ఎపిసెట్ ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు.

## డైట్‌లో ప్రారంభమైన అమెజాన్ వెబ్ సర్వీసు వర్క్ షాప్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస నిర్వహించిన వర్క్ షాప్ సోమవారం ప్రారంభించారు.వారం రోజులు పాటు ఈ.సీ. ఈ.విద్యార్థులకు జరుగుతున్న ఈ వర్క్ షాప్ ద్వారా విధ్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్ సర్టిఫికెట్స్ సంపాదించుకుంటారు అని ఈ.సీ.ఈ విభాగాధిపతి డాక్టర్ పి. పూర్ణప్రియ తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ ఈ సర్టిఫికెట్స్ విద్యార్థులు ఉద్యోగ భవిషత్ కు ఎంతగానో ఉపయోగ పడతాయి అని తెలిపారు.రిసోర్స్ పర్సన్ జె.లోవబాబు అమెజాన్ వెబ్ సర్వీసెస లోని లోడ్ బ్యాలెన్సింగ్, వెబ్సైట్ హెూస్టింగ్,క్రియేషన్ ఆఫ డాటా బేస వంటి వివిధ టెక్నిక్స్ ని నేర్పిస్తున్నారు అని తెలిపారు. వర్క్ షాప లో పాల్గొనడానికి అవకాశం ఇచ్చిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠ రావు కి,డీన్ అచడమిక్స్ డాక్టర్ కె . పార్వతి, ఈ.సీ.ఈ విభాగాధిపతి డాక్టర్ పి.పూర్ణ ప్రియ,ఛైర్మన్ కి అభినందనలు తెలిపారు.

## వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ,ముత్యాలమ్మపాలెం ఎలిమెంటరీ స్కూల్ వద్ద గల అంగన్ వాడీ కేంద్రం లో మంగళవారం సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు అధ్యక్షతన వైయస్సార్ సంపూర్ణ పోషన్ లో భాగంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన రాష్ట్ర పంచాయతీ రాజ్ చాంబర్ ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు చేతులమీదుగా గర్భిణీలకు మరియు బాలింతలకు గర్భిణీ స్త్రీలు, బాలింతలకు 3 కేజీల ఫోర్టి ఫైడ్ బియ్యం, 2 కేజీల రాగి పిండి, 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, 1 కేజీ కందిపప్పు, 1 కేజీ అటుకులు, అరలీటర్ వంట నూనె, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశెనగ చిక్కి, 250 గ్రాముల ఖర్జూరం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పౌష్టికాహారం సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యం పేంపుపొందించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు చింతకాయల ముత్యాలరాణి, సూరాడ మహేశ్వరి, సూరాడ రమాదేవి, సమ్మంగి ముత్యాలమ్మ ,మరియు పరవాడ మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న ,మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు ,డాక్టర్ ,విజయ కుమార్ ,పంచాయతీ కార్యదర్శి సోమినాయుడు , పంచాయతీ మహిళ పోలీస్ షేక్ జావేరి, బాలింతలు ,గర్భిణీలు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్టోన్ ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలి



విజయనగరం: రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో రాళ్ళ పాతే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఎస్.కోట, ఎల్.కోట, కొత్తవలస, గంట్యాడ మండలాల్లో ఆయన మంగళవారం విస్తృతంగా పర్యటించారు. పలు గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను, స్టోన్ ప్లాంటేషన్ ను, కొత్త జాతీయ రహదారి 516 బి ప్రతిపాదిత గ్రామాలను సందర్శించారు.

కొత్తవలస మండలం కంటకాపల్లిలో స్టోన్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. నిర్ధేశిత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని ఇతర గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తెలుసుకున్నారు. రీసర్వేను మరింత వేగవంతం చేయాలని, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. కొత్తవలస, ఎల్.కోట, ఎస్.కోట మండలాల మీదుగా ప్రతిపాదిత 516 బి కొత్త జాతీయ రహదారి సాగే గ్రామాలను, రహదారి మార్గాన్ని ఆయన పూర్తిగా పరిశీలించారు. అలాగే ఎస్.కోట మండలం సీతంపేట గ్రామం వద్ద నిర్మించనున్న బైపాస్ బ్రిడ్జి స్థలాన్ని కూడా ఆయన సందర్శించారు. అనంతరం గంట్యాడ మండలంలో పర్యటించారు. 516 ఇ జాతీయ రహదారి కారణంగా నష్టపోయిన గ్రామాలను సందర్శించారు. రైతులతో మాట్లాడారు. మధుపాడ రోడ్డును పునరుద్దరించాలని, కొండతామరాపల్లి బాపనబంద ఛానల్స్ బాగుచేసి, నీరు వెళ్లే అవకాశాన్ని కల్పించాలని, జాతీయ రహదారుల అథారిటీ ఇంజనీర్లను, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు.

ఈ పర్యటనలో ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, ఎస్.కోట తాశిల్దార్ డి.శ్రీనివాసరావు, ఎల్.కోట తాశిల్దార్ ఆదిబాబు, గంట్యాడ తాశిల్దార్ స్వర్ణకుమార్, ఆయా మండలాల డిటిలు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏయూ జర్నలిజం విద్యార్థులకు వీసీ దిశానిర్ధేశం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విద్యార్థులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి దిశానిర్దేశం చేసారు. మంగళవారం తన కార్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జర్నలిజం కోర్సు పూర్తిచేసే నాటికి జ్ఞానంతో పాటు ప్రత్యక్ష అవగాహన కలిగి ఉండాలన్నారు. జర్నలిజం పూర్తిచేసిన విద్యార్థులు స్టార్టప్ సంస్థలను ప్రారంభిస్తే తాము అవకాశం ఇస్తామన్నారు. ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లో వీరికి అవసరమైన వసతులు కల్పించి, మార్గదర్శకం అందించడం జరుగుతుందన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏయూ లుక్స్ సంచికల రూపకల్పనలో జర్నలిజం విద్యార్థులు భాగం కావాలని సూచించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయాన్ని వెచ్చించాలన్నారు.త్వరలో వంద సంవత్సరాల వేడుకను జరుపుకుంటున్న ఆంధ్రవిశ్వవిద్యాలయంలో యువత భాగస్వామ్యం పెంచే ప్రయత్నం జరుగుతోందన్నారు. ప్రతీ విద్యార్థి ప్రత్యక్షంగా ఏయూ కళాశాలలు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు సంబంధించిన ఆసక్తిదాయక ప్రత్యేక కథనాలను అందించాలని సూచించాను. నూతన ఆలోచనలు స్వీకరించడానికి తాము సిద్దంగా ఉన్నామని, నవ్య ఆలోచనలతో పనిచేయాలని సూచించారు. విదేశీ విద్యార్థుల భాగస్వామ్యం సైతం దీనిలో స్వీకరిస్తామన్నారు. ఏయూ తీర్చిదిద్దుతున్న ఏయూ లుక్స్ తెలుగు, ఆంగ్ల వారపత్రికలు వేలాది మంది పూర్వవిద్యార్థులు చూడటం జరుగుతోందన్నారు. దీనిని ఆకర్షణీయంగా, ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దే బాధ్యతను అందరూ స్వీకరించాలని సూచించారు. రానున్న కాలంలో మరిన్ని మార్పులు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ సి.ఎం. వినయ కుమార్, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగాలపై వ్యవసాయాధికారులకు శిక్షణ




విజయనగరం: ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో చేయనున్న పంటకోత ప్రయోగాలపై, సీసీఈ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక డీఆర్సీ మీటింగ్ హాలులో మండల వ్యవసాయ, గ్రామ వ్యవసాయ అధికారులకు, ఏఎస్వోలకు మంగళవారం ప్రత్యేక జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి వి.టి రామారావు ప్రారంభోపాన్యం చేసి శిక్షణ ప్రారంభించారు. ఆయనతో పాటు జిల్లా ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని, వ్యవసాయ శాఖ ఏడీ అన్నపూర్ణ శిక్షణలో పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటకోత ప్రయోగాలను అత్యంత కచ్చితంగా నిర్వహించాలని, ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. సీసీఈ (క్రాప్ కటింగ్ ఎక్స్పర్మెంట్) యాప్‌ను వినియోగించి వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో నమోదు చేసే వివరాలు పంటలకు, రైతులకు సంబంధించిన వివరాలను కచ్చితంగా తెలుసుకోడానికి, భీమా పథకం వర్తింపులో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ జాగురూకత వహించి వివరాలను అత్యంత కచ్చితంగా నమోదు చేయాలని చెప్పారు. జిల్లా స్థాయి శిక్షణలో తెలుసుకున్న అంశాలపై మండల, గ్రామ స్థాయిలో శిక్షణలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ క్రమంలో సీపీవో కార్యాలయ సహాయ సంచాలకులు మహాలక్ష్మి సీసీఈ యాప్ వినియోగం, పంటకోత ప్రయోగంలో అవలంబించాల్సిన విధానాలపై మండల, గ్రామ వ్యవసాయ అధికారులకు, ఏఎస్వోలకు పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. సాంకేతికపరమైన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన పద్ధతులపై గురించి వివరించారు.

కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జమదగ్ని, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అన్నపూర్ణ వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, ఏఎస్వోలు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## 3వ విడత వారాహి యాత్ర విజయవంతం చేయాలి



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ఈ నెల 10 న విశాఖపట్నం సిటీలో ప్రారంభమవుతుందని ఈ యాత్రలో యలమంచిలి నియోజకవర్గ నాలుగు మండలాల నుంచి జనసేన నాయకులు, జనసైనికులు అధిక సంఖ్యలో పాల్గొనబోతున్నారని రాష్ట్ర అధికార ప్రతినిధి యలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ సుందరపు విజయ్ కుమార్ అన్నారు. రాంబిల్లి మండలం హారిపురంలో గల నియోజకవర్గ ప్రధాన పార్టీ కార్యాలయంలో మంగళవారం నాడు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాహి 3 వ విడత యాత్ర ఈ నెల 10 నుండి 19వ తేదీ వరకు జరుగుతుందన్నారు.10వ తేదీన విశాఖపట్నంలో ప్రారంభమై అదే రోజు సాయంత్రం జగదాంబ జంక్షన్ లో భారీ బహిరంగ సభను పవన్ కళ్యాణ్ నిర్వహించనున్నారన్నారు.దానితో పాటుగా జనవాణి కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. అధికార వైసీపీ పార్టీ అవినీతి, భూకబ్జాలు ఎక్కడ బయటపడతాయనో భయంతో గతంలో జనవాణి కార్యక్రమం జరగకుండా అడ్డుకున్నారని ఇలాంటి ఎన్ని కుయుక్తులు పన్నినా ఈసారి మటుకు ఖచ్చితంగా జనవాణి కార్యక్రమం కూడా జరగడంతో పాటుగా కొంతమంది అధికార పార్టీ నేతల కనుసన్నలలో అక్రమాలు జరిగిన విస్సన్నపేట భూములను కూడా పవన్ కళ్యాణ్ ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం ఉందన్నారు.డేటా చోరీతో పాటుగా వాలంటీర్ల శ్రమను దోచుకుంటుందని పవన్ కళ్యాణ్ ఆరోపిస్తే నియోజకవర్గ శాసనసభ్యులు యువి రమణమూర్తి రాజుతో పాటుగా మరో ప్రజాప్రతినిధి కూడా పవన్ కళ్యాణ్ పై ఆరోపణలు చేశారని మరి అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం గ్రామ సచివాలయంలో వాలంటీర్ ద్వారా జరిగిన అక్రమాన్ని గురించి ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని విమర్శలు గుప్పించారు. ఇప్పటికీ కూడా యలమంచిలి నియోజకవర్గములో అధికార పార్టీ నేతలలో వర్గ పోరు నడుస్తుందని ప్రస్తుత ఎమ్మెల్యే 3 సార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ అభివృద్ధి ఎక్కడా కనిపించని దుస్థితి ఏర్పడిందని ఘాటుగా విమర్శించారు. తాను ఇన్నాళు అధికారంలో లేకపోయినా ప్రజలకోసం నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో ప్రజలకి తోడుగా ఉన్నానన్నారు.ప్రభుత్వం ప్రజలకు వారికి సంబంధించి 11 రకాల ధ్రువపత్రాలను అందించే కార్యక్రమం చేపడితే రోజా సర్టిఫికేట్ లు అందించడానికి వెళ్లడం తప్ప ఒక్కసారి రాంబిల్లి మండలంలో వెంకటాపురం నుంచి కొత్త నేవి కాలనీ వరకు ఉన్న రోడ్డుకి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఒక్కసారి ఆ రోడ్డు సమస్య పరిష్కారం గురించి ఆలోచించలేకపోవడం దురదృష్టమన్నారు. ఈ సారి వైసీపీ బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయమని ప్రజా ఆశీర్వాదంతో సుమారు తాము 50 వేల ఓట్ల మెజారిటీతో జనసేన యలమంచిలి నియోజకవర్గములో గెలుపొందడం తధ్యం అని అన్నారు. నియోజకవర్గములో ఏడు వార్డులలో జరగబోయే బై ఎలక్షన్లలో జనసేన మద్దతు ఇచ్చే అభ్యర్థుల గెలుపునకు జనసైనికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అచ్చుతాపురం మండల మాజీ జడ్పిటిసి సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, యలమంచిలి మున్సిపాలిటీతో పాటుగా మండలాల అధ్యక్షులు బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్న దొర, టెక్కలి పరశురాం, బొద్దపు శ్రీనివాసరావు,పార్టీ సీనియర్ నాయకులు గుర్రాల శేఖర్,ఇతర నాయకులు లాలం సోము నాయుడు, కార్యదర్శులు చోడపల్లి ప్రసాద్, నాని, బుల్లిబాబు, చొప్ప శ్రీను, కొలగాని భాస్కర్, వీర మహిళ సుందరపు సత్యవతి, జనసైనికులు పాల్గొన్నారు .

## వీధుల్లో పర్యటిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్న గోడి వెంకట్



కాకినాడ, (విశాఖ సమాచారమ్): 41 డివిజన్ లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆదేశాలు మేరకు వైకాపా నాయకులు గోడి వెంకట్ ప్రతి రోజూ పలు వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఈరోజు మంగళవారం ఉదయం యిమ్మిడి వారి వీధి, చాగంటి వారి వీధి, పుళ్ళవారీ వీధి, పెనుమూడి వారి వీధి, చామర్తి వారి వీధి, గాంధీనగర్ మార్కెట్ వెనుక వీధి దీపాలు రాత్రులు పనిచేయకపోవడం తో అక్కడ ప్రజలకు ఇబ్బందిగా ఉండటాన్ని గమనించి మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్ట్రికల్ AE సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్ళిగా వెంటనే వీధి దీపాలు వెలిగించేదుకు చర్యలు తీసుకున్నారు కార్యక్రమంలో స్థానికలు కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## డైట్ లో నేక్ సెమినార్ పోస్టర్ విడుదల



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో యుజిసి నేక్ ద్వారా కళాశాల అంతర్గత నాణ్యత హామీ కేంద్రం ఆధ్వర్యంలో "ఊహించబడిన ఫలితం కోసం బోధనాపరమైన పద్ధతులు పై నాణ్యత అంకురార్పణం" అనే కార్యక్రమం ఈ నెల 11 , 12 తేదీలలో నిర్వహింపబడుతుందని , ఈ కార్యక్రమమునకు వివిధ కళాశాలలనుండి అధ్యాపకులు హాజరు అవుతారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఆర్.వైకుంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ , ప్రిన్సిపాల్.వైకుంఠరావు అధ్యాపకుల చేతుల మీదుగా సెమినార్ పోస్టర్ ను విడుదల చేసారు.ఈ సందర్భముగా కళాశాల చైర్మన్ రత్నాకర్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలకు అనుగుణముగా ఆధునిక పద్దతుల ద్వారా నాణ్యత ప్రమాణాలను రూపొందించి విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేరే విధంగా తయారుచేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ కే.పార్వతి, డీన్ అడ్మిన్ కే.ఈశ్వర్రావు, అస్సోసియేటివ్ డీన్ అకాడెమిక్స్ ఏ.కృష్ణ నాగ్ విభాగాధిపతులు డాక్టర్ కే.సుజాత, డాక్టర్. ఏ.స్.ల.కే.గోపాలమ్మ , డాక్టర్ పి పూర్ణ ప్రియ, డాక్టర్ పి.బి.రామ్ కుమార్ డాక్టర్ సిహెచ్. ప్రభాకర్ రావు ఎన్ .రాము పాల్గొన్నారు.

## చెవి ముక్కు గొంతు వ్యాధులపై ఆర్ఎంపీ లకు అవగాహన

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): బాలలకు సీజనల్ వ్యాధుల్లో బాగంగా గొంతు నొప్పులు,చెవి,ముక్కు వ్యాధులపై అవగాహన కల్పిస్తూ,ఆంధ్ర మెడికల్ కాలేజీ మాజీ ప్రొఫెసర్, డా. రామారావు హాస్పటల్ యమ్ డి, ఈ ఎన్ టి. డాక్టర్ అన్నపర్ణేశ్వరరావు మాట్లాడారు. స్థానిక కంచరపాలెం డా. రామారావు గారు హాస్పిటల్లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆద్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చెవి,ముక్కు, గొంతు వ్యాధులపై నాణ్యమైన వైద్యం,రోగ నిర్దారణలపై డా.అన్నపూర్ణేశ్వరరావు, క్రిటికల్ కేర్,అత్యవసర సమయాల్లో ఆర్ యమ్ పి లు చేయవలసిన ప్రాధమిక వైద్యం పై డా.సౌజన్య, హాస్పిటల్ అందిస్తున్న సౌకర్యాలతో పాటు,పేదవారికి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉచితంగా వైద్యం అందిస్తామని డా.శేషకుమారిలు మాట్లాడారు.ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి అద్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు,గౌరవ సలహాదారు కోన ప్రకాష్ లు మాట్లాడుతూ అద్భుతమైన విజ్ఞానాన్ని అందించి శిక్షణ సర్టిఫికెట్లు అందించిన హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందిస్తూ సంఘం వారికి పూర్తిగా సహకరించాలని కోరారు.జోనల్ సంయుక్త కార్యదర్శి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు,గౌరవ సలహాదారు బాల శంకర్రావు ఉపాధ్యక్షుడు కె.వేంకటరావు, కోశాధికారి క్రిష్ణ,గాజువాక అధ్యక్షుడు ప్రసాద్,కార్యదర్శి అను, అన్నపూర్ణ, గంగాభాయ్,మదీనా, మురళి, హాస్పిటల్ పిఆర్ఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 77వ స్వాతంత్ర దినోత్సవానికి పగడ్బందీ ఏర్పాట్లు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే వేడుకలను పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మైదానంలో ఏర్పాట్లను పోలీస్ శాఖ జిల్లా రెవెన్యూ అధికారి సౌండ్ సిస్టం ఏర్పాట్లను సమాచార శాఖ డిఐపిఆర్ఓ పర్యవేక్షించాలన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ అధికారి, తాగునీరు శానిటేషన్ జీవీఎంసీ జోనల్ కమిషనర్, డిపిఓ పర్యవేక్షిస్తారని చెప్పారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖ, పశు సంవర్ధక, మత్స్య, అటవీ, తాగునీటి సరఫరా, జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య, పట్టణాభివృద్ధి, డ్వామా, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖలు జిల్లాలో ఆయా శాఖల అభివృద్ధిని తెలియపరిచే శకటాలను ప్రదర్శించాలన్నారు. జాయింట్ కలెక్టర్ మెరిట్ సర్టిఫికెట్లను పర్యవేక్షిస్తారని, ముఖ్య ప్రణాళిక అధికారి, జి ఎస్ డబ్ల్యు ఎస్ ప్రత్యేక అధికారి కార్యక్రమాల అనుసంధాన, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

## 11న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): ఎపిఈపీడీసీఎల్ యలమంచిలి సబ్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 11 వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఫోరమ్ చైర్మన్ ,విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపై పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఈ ఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను తెలియజేయడంతో పాటుగా విద్యుత్ నిర్వహణపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

## మంత్రి ఇంద్రజిత్ సింగ్ కు వినతి పత్రం అందజేసిన ఎంపీ సత్యవతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా,కశింకోట గ్రామం లో వంతెన బాట నిర్మాణం పూర్తికి ఎంపీ నిధులు వినియోగానికి అనుమతులు మంజూరు చేయాలని స్టాటిస్టిక్స్ అండ్ కార్పొరేట్ వ్యవహారాల మంత్రి ఇంద్రజిత్తు సింగ్ కి అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి వినతి పత్రం అందజేశారు. మంత్రిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి అనకాపల్లి జిల్లా,కశింకోట గ్రామం లో వంతెన బాట నిర్మాణానికి సుమారు 2కోట్ల 85 లక్షలు అవసరం అవుతాయని ఆ నిధులను సమకూర్చడానికి తన ఎంపీ నిధులు నుండి వినియోగానికి అనుమతులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ కసింకోట గ్రామస్థులు నిత్యం అవసరమైన వ్యవసాయ కార్యకలాపాలు, పశువుల పెంపకం , పొలాల సాగు కోసం శారదా నదిని దాటి వెళ్ళవలసి ఉంటుంది అని,వర్షాకాలంలో ఈ నది దాటడం చాలా ప్రమాదకరంగా మారిందని దీని ద్వారా అనేక విషాద సంఘటనలు ప్రాణనష్టం జరిగాయని తెలిపారు ఫుట్ బ్రిడ్జి లేకపోవడం వలన స్థానిక ప్రజలు నది దాటడానికి స్థానిక దోనెల పై ఆధారపడటం తప్ప వేరే మార్గం లేకుండా పోయిందని తెలిపారు. దీని పై కేంద్ర మంత్రివర్యులు సానుకూలంగా స్పందించారని ఆమె తెలియజేశారు.

## తుని రైల్వే టన్నెల్ ఎస్టిమేట్స్ కు నిధులు,గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవననిర్మాణంకు నిధులు మంజూరు చేయాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఏజెన్సీ, తూర్పు గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లా లో వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని,పలకరించి వారి వినతులు,ఆ ప్రాంత ఇబ్బందులు తెలుసు కోనుటకు పర్యటిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డినీ రాజమండ్రీ లో మర్యాద పూర్వకంగా కలిసి పార్లమెంట్ పరిధిలో ముఖ్య అభివృద్ధి కార్యక్రమాలకు ఆదేశాలు ఇవ్వండి అని కోరడం జరిగింది.

## వ్యవసాయ సిబ్బంద అధ్యర్యంలో పెరటి తోటలు వేసిన రైతులు



నర్సీపట్నం రూరల్, (విశాఖ సమాచారమ్): మంగళవారం మాకవరంపాలెం మండలం జి. నగరం గ్రామంలో పెరటి తోటలు వేయించడం జరిగింది. ముఖ్యంగా ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి, కాయగూరలు తమకున్న కొద్ది స్థలములో వేసుకొని సంవత్సరం పొడవున ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించుకుని ఆరోగ్యకరమైన కూరగాయలను తినవచ్చునని రైతులకు తెలియపరచడం జరిగింది. ఎటువంటి పురుగు మందులు వాడవలసిన పనిలేదు. వరి పొలాలు గట్ల మీద కందులు కూడా రక్షక పంటగా పెట్టించడం జరిగింది. ప్రధాన పంటకు ఎటువంటి ఇబ్బంది రాకుండా మరియు కంది చెట్ల నుండి కూడా ఆదాయం తీసుకునేలా ఉపయోగపడతాయని చెప్పడం జరిగింది.

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది. సుదర్శన్, ప్రభావతి, దేవి తదితరులు ఉన్నారు.

# సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమాజాన్ని మార్చే శక్తి అధ్యాపకుల సొంతమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం ఏయూ హెచ్ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సామాజిక అభివృద్ధికి దోహదకారిగా నిలవాలని సూచించారు. విద్యార్థిలో లోపాలను ఎత్తిచూపకుండా వారిని సరిదిద్ది మార్గదర్శకం అందించే బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వర్తించాలన్నారు. అధ్యాపకులు సామాజిక ఇంజనీర్లుగా నిలుస్తారన్నారు. భావిభాతర పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. తల్లిదండ్రుల తరువాత అంతటి గౌరవం గురువుకే దక్కుతుందన్నారు. భారత్ విశ్వగురువుగా మారాలని ప్రధాని నరేంద్రమోదీ ఆకాంక్షిస్తున్నారని, ఈ దిశగా యువతను తీర్చిదిద్దే బాధ్యత నేటితరం అధ్యాపకులపై ఉందన్నారు. ప్రతీ అధ్యాపకునికి నిజమైన సంపదగా నిలిచేది ఉన్నతంగా ఎదిగిన విద్యార్థులేనన్నారు. నిస్వార్ధంగా ఇక్కడ నేర్చుకున్న అంశాలను మీ కళాశలలో విద్యార్థులకు చేరువ చేసే దిశగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ సమాజంతో విద్యార్థులను అనుసంధానం చేయాలని సూచించారు.

కార్యక్రమంలో హెచ్ఆర్‌డిసి కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వి. కృష్ణ, ఆచార్య ఎన్.ఏ.డి. పాల్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న 21 మంది అధ్యాపకులకు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించే ఆర్ యమ్ పి లే సమాజ సేవకులు డా వరలక్ష్మి




**యస్.కోట, (విశాఖ సమాచారమ్):** గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు రాత్రానక,పగలనక వైద్య సేవలందించే ఆర్ యమ్ పి లే నిజమైన సమాజ సేవకులని స్థానిక వరలక్ష్మి హాస్పిటల్ యమ్ డి డాక్టర్ కొలపర్తి వరలక్ష్మి అన్నారు.మంగళవారం ఉదయం స్థానిక వరలక్ష్మి పబ్లిక్ స్కూల్లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆద్వర్యంలో డా.వరలక్ష్మి హాస్పిటల్ సౌజన్యంతో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీజనల్ వ్యాధులు తీసీకోవాలసిన జాగ్రత్తలపైన,హెర్నియా, గిలకదిగడం వ్యాధులపైన డా.అనంత్,స్త్రీల వ్యాధులు, గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన ఆహారం తదితర అంశాలపై డా.ప్రసన్న అవగాహన కల్పించారు. హాస్పిటల్లో సౌకర్యాలపై మార్కెటింగ్ మేనేజర్ వైకుంఠరావు వివరించారు.ముఖ్య అతిథిగా హాజరైన వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ సంఘం పటిష్టంగా ఉంటేనే మనం గుర్తింపు సాధించగలమని,ఈ మద్య కొందరు మన సంఘంలో ఐక్యతను చెడగొట్టి కొత్త సంఘాల పేరిట పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని 14సం వత్సరాలు మన సంఘంలో నడిచి,వివిధ హెూదాలు అనుభవించిన వారు ఇపుడు మన సంఘం గుర్తింపు లేనిదని అనడం దొంగే దొంగ దొంగ అన్నట్లు ఉందని అటువంటి మోసగాళ్ళ మాటలు విని మనం మోసపోకూడదని హెచ్చరించారు.రాష్ట్ర ఫెడరేషన్లో సభ్యత్వం గల మన సంఘం ద్వారా మాత్రమే మనకు మేలు జరుగుతుందని అన్నారు.సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి అద్యక్షతన జరిగిన కార్యక్రమంలో జోనల్ గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, జోనల్ ఉపాధ్యక్షుడు అల్లాడ త్రినాథరావు, జిల్లా కోశాధికారి పరవాడ ఉమాశంకర్, జిల్లా నాయకులు రవి, గుప్తా, దివాకర్,భవాని,ఝాన్సీ, స్థానిక నాయకులు యమ్. ప్రభాకర్, గొండయ్య, షణ్ముఖాచారి, నారాయణ రావు, యశోధక్రిష్ణ, రవి, సింహాచలం, కవిత తదితరులు పాల్గొన్నారు.

# 9 నుంచి అన్ని పంచాయతీల్లో "నా మట్టి-నా దేశం"

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారత దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో భాగంగా భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నా మట్టి- నా దేశం (మేరీ మట్టి మేరీ దేష్) ,నేల తల్లికి నమస్కారం,వీరులకు వందనం' అనే ప్రత్యేక కార్యక్రమాన్నిఆగస్టు 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు వివిధ రకాలైన కార్యక్రమాలు చేపట్టాలని నిర్దేశించడం జరిగిందని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రతి గ్రామపంచాయతీ, మండల ప్రధాన కార్యాలయాలు, అలాగే మున్సిపాలిటీ వార్డుల నందు, పట్టణ ప్రాంతాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని జాయింట్ కలెక్టర్ కే ఎస్ విశ్వనాథన్ అన్నారు. ఈ కార్యక్రమం పై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో వెబెక్స్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామము నందు మట్టిని మరియు ఆ గ్రామంలో గల నీటిని సేకరించడం, 75 వివిధ రకాలైన మొక్కలను అమృత వాటిక అనే పేరు మీదగా మొక్కలు నాటడం, దేశం గురించి జీవితాన్ని అంకితము చేసిన సైనికులు, CRPF, ITBP, BSF, వివిధ పోలీస్ సిబ్బంది పేర్లతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడము, గ్రామంలో గల చెరువు గట్టులపైన మొక్కలు నాటి, చెరువులను పరిశుభ్రంగా ఉంచడము, మొదలైన కార్యక్రమాలను మరియు దేశం కొరకు ప్రాణ త్యాగం చేసిన వారి కుటుంబ సభ్యులను సన్మానం చేయాలన్నారు. ఈ నెల 9 నుంచి 15 వరకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందే శంతోపాటు దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ ఎంపిక చేసిన అమృత సరోవర్లు, నీటివనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేసుకొని సెల్ఫీలు దిగి నిర్దీత వెబ్ సైట్ లలో అప్లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. 16 నుండి 20 వరకు మండల, అర్బన్ ప్రాంతాలలో నిర్వహిస్తారని తెలిపారు. ప్రతీ కార్యక్రమంలో శిలా ఫలకాల చుట్టూ ప్రజలందరూ మట్టిని గాని, మట్టి దీపాన్ని గాని చేతిలో ఉంచుకుని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయాలన్నారు. పంచప్రాణ ప్రతిజ్ఞ చేసి సెల్ఫీ అప్లోడ్ చేయాలని పిలుపునిచ్చారు. ''వసుధకు వందనం'' పేరుతో 75 మొక్కలను నాటి, వీరులకు వందనం చేపట్టి మరణించిన వీరుల కుటుంబాలను, జీవించి ఉన్న వీరులను సత్కరించి ఈ ఫొటోలన్నీ అప్లోడ్ చేయాలన్నా రు. ప్రతి గ్రామపంచాయతీ నుండి మట్టిని కలశం లో సేకరించి మండల స్థాయిలో అమృతవాటికని ఏర్పాటు చేసి అక్కడ ఉంచాలని అన్నారు. ఈ నెల 27, 28వ తేదీలలో ఢిల్లీకి చేరుకుని 29 లేదా 30 న జరిగే కర్తవ్యపథ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందని జాయింట్ కలెక్టర్ వివరించారు.

ఈ కార్యక్రమం కోసం స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, యుద్ధవీరులు , పోలీసులు , డాక్టర్లు అందర్నీ కూడా భాగస్వామ్యం చేయాలని అన్నారు. రెవెన్యూ ,డ్యామా , జిల్లా పరిషత్ , జిల్లా పంచాయతీ, పౌర సరఫరాలు, ఎడ్యుకేషన్, రవాణా, నెహ్రూ యువకేంద్రం, జిల్లా శిశు సంక్షేమ , సైనిక్ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**13 వ తేది నుండి 15 వరకు "హర్ ఘర్ తిరంగా" :-**

ఆజాదీ కా అమృత మహెూత్సవ లో భాగంగా ప్రతి ఇంటిపై జెండా ఎగరవేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13 వ తేది నుండి 15 వరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని నిర్వహంచనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ వెబెక్స్ సమావేశంలో డిఆర్ఓ ఎస్ శ్రీనివాస్ మూర్తి , జిల్లా పరిషత్ సీఈఓ శ్రీరామ్మూర్తి, డీఈవో చంద్రకళ, డిఆర్డిఏ పిడి శోభారాణి, సమాచార శాఖ అర్.జే.డి , వి. మణిరామ్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8885687610,
7981904385

## కమనీయం అప్పన్న కల్యాణం



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** శ్రీ శ్రీ శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్టింపజేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## ఏపీవో ఈశ్వరరావుకు ఘన సన్మానం



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** నక్కపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఏపీవోగా ఈశ్వరరావును బదిలీపై వెళుతున్నందున వీఆర్పీలు అందరూ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సీతారామరాజు మండల పరిషత్ సిబ్బంది వైస్ ఎంపీపీ నానాజీ రాష్ట్ర మౌలిక సదుపాయాలు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ వైస్ ఎంపీపీ ఈశ్వరరావు ఇతర ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొని బదిలీపై వెళ్తున్న ఈశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు రామకృష్ణ మాట్లాడుతూ ఎక్కడ పని చేసినా నీతి నిజాయితీతో పని చేస్తే వారికి ప్రజలు నాయకులు తో మంచి ఆదరణ ఉంటుందని ఆయన అన్నారు. ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఒక వరం అని దీనికి సేవ చేస్తేనే గుర్తింపు ఉంటుందని వారన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ కాసులమ్మ, అన్నీ గ్రామాల రిసోర్స్ పర్సన్స్ మండలం పరిషత్ అధికారులు వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు పౌష్టికాహారం అవసరం




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** వయసు రీత్యా వృద్ధులకు అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉన్నందున విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ వేదుల శ్రీరామ శర్మ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం అధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కలుషితమైన నీరు, అపరిశుభ్రత వాతావరణంతో రోగాలు బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. భరించలేని వైద్య ఖర్చులు కుటుంబానికి భారం అవుతున్నాయని అన్నారు. ఎముకల పటిష్టతకు బలమైన పోషకాహారాలు అయిన ఆకుకూరలు, పాలు తీసుకోవాలని డాక్టర్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

షోడశ కళానిధికి వేద నాద నృత్య స్వరోపచారములు
రాత్రి : 08:30 గ॥ లకు అర్చన, దశహారతుల సమర్పణ
తేది : 07-08-23 నుండి 16-08-23 / సమయం : 16:30 TO 20:30 వరకు
వేదిక : తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణమండపం, యమ్.వి.పి. కాలని, విశాఖపట్నం
వైదిక విజ్ఞాన విపంచి విశాఖ సాగర శ్రీ వారి కార్తీక దీపోత్సవ కమిటి శ్రీ హరి సేవా వాలంటీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ / టి.టి.డి హిందు ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధార్మిక మండలి
విశాఖపట్నం 9848665600, 9440629646, 9985266600, 9703466600

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776